నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 20-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 192 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

లీకుల రంతు
కోతిచేష్టల తంతు
పరీక్ష తాపం.

అతడు మిరియం
ఆమె గుంటూరు మిర్చీ
గమ్మత్తు జంట.

గుమ్మడి పువ్వు
పాకకు పారిజాతం
పేద ఔషధి.

వేసవి కాలం
పానీయాల స్వాగతం
తీరని దాహం.

పాతాళలోకం
మోసానికి బలిపీఠం
దేవుడు రాజ్యం.

- రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

పెంచి పోషించండోయి
వృక్ష జాతి ! పక్షిజాతి !
నువ్వు జీవించుకుంటూ
జీవించ నిచ్చుట నీతి !

బిర్యాని తిని, ఇరానీ
చాయి తాగు గరం గరం !
తిరిగి చూడు హైద్రాబాద్
జీవవైవిధ్య నగరం !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

ప్రకృతిపై మానవ దాడి ఎంతమాత్రం సహేతుకం కాదు: మంత్రి జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, ఏప్రిల్ 19: ప్రకృతిపై మానవ దాడి ఎంత మాత్రం సహేతుకం కాదని విద్యుత్ శాఖామంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. తద్వారా మానవ మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చారని చెప్పారు. భారతీయ విలువలే మానవ మనుగడను నిర్దేశిస్తాయని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సత్యసాయి ధ్యానమందిలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా శిక్షణా తరగతులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. భూమండలంలో అన్ని జీవులు ప్రకృతి పరిరక్షణకు తావత్రయ పడుతున్నాయని, దానికివిరుద్ధంగా మానవుడు మాత్రం ప్రకృతిపై అన్ని వైపులా దాడులు చేసి తనకు తాను అంతరించే పరిస్థితులు ఉత్పన్నం చేసుకుఉన్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా సృష్టిలో ఏ జీవికి లేని అహం మనిషిని అవరించిందన్నారు.

అన్నీ తమకే తెలుసంటూ అహంతో మానవుడు చివరఖారికి దారితప్పి ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ఆత్మహత్యలు కూడ ఒక్క మానవ జీవితానికే ఆవరించడం బాధా కరమన్నారు. అటువంటి విపత్కర పరిస్థితుల నుంచి బయట పడేందుకు యోగా ఉపకరిస్తుందని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. మానవుడు సంఘ జీవిలా కొనసాగితే ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవొచ్చని వెల్లడించారు.

కాంగ్రెస్ కి షాక్.. బిఆర్ ఎస్ లో చేరిన కార్పొరేటర్

హైదరాబాద్, ఏప్రిల్ 19:మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ బాలు నాయక్ భారాస తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర విద్యశాఖ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అన్ని వర్గాలను కలుపుకుపోయే ఏకైక మనస్తత్వం మంత్రిదని.. అభివృద్ధి ఆమెకే సాధ్యమని భావించి నేడు పార్టీలో విలీనం అవుతున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్రా జగన్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్జున్, మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షులు నిమ్మల నరేందర్ గౌడ్, కొ ఆప్షన్ సభ్యులు ఎస్కే ఖలీల్ పాషా, గుండోజి రఘునందన్ చారి బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి రామిరెడ్డి, బాలాపూర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వొంగెటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి బలు నయక్, ,బొడ్రా మాధవరెడ్డి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపు కోసం కార్యాచరణ రూపొందించాలి

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రానున్న హరితహారంలో నీటి పారుదల శాఖ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో పచ్చదనం పెంపు కోసం కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. హరితహారం సన్నాహకాలు, ఏర్పాట్లపై సంబంధిత శాఖలు, ఉన్నతాధికారులతో బీఆర్ కే భవన్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ముఖ్యమంత్రి సూచన మేరకు నీటి పారుదల శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని తెలిపారు. చక్కటి పచ్చదనం పెంపుతో పాటు, సమీప గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సీజన్, ఫల సహాయం అందేలా సంపద వనాలను సృష్టించాలని సాగునీరు, పంచాయితీ రాజ్, అటవీశాఖ అధికారులను చీఫ్ సెక్రటరీ కోరారు.

మూడు శాఖల క్షేత్ర స్థాయి అధికారులతో జిల్లాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, స్థల పరిశీలన, స్థానికంగా అనుకూలతలు కలిగిన చెట్ల జాతులను గుర్తించాలని, మొక్కలు నాటిన తర్వాత వాటి రక్షణ చర్యలపై కూడా ముందస్తు ప్రణాళిక ఉండాలని సూచించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల దగ్గర, కాలువల వెంట ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించటంతో పాటు, రక్షణ చర్యలు చేపట్టి, అన్ని కాలువల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న చోట బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టాలని సమీప గ్రామాల ప్రజలు, రైతుల సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. ఒక సారి పెట్టిన మొక్కలు, మంచి ఎదుగుదలతో పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని అన్నారు. ఇప్పటిదాకా శాఖ పరిధిలో ప్రాంతాల వారీగా ప్రణాళికాబద్ధంగా రానున్న హరితహారంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని చీఫ్ సెక్రటరీ సూచించారు. అటవీ భూముల్లో చేపట్టిన "హరితవనాల్లో" మొక్కలు నాటే కార్యక్రమం పురోగతిని కూడా సమీక్షించారు. రానున్న సీజన్ లో అన్ని హరితవనాల్లో టార్గెట్లు పూర్తి కావాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పీసీసీఎఫ్, హెచ్ఓఓఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి నందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ ఎం. హన్మంత రావు, స్పెషల్ కమీషనర్ వీ.ఎన్.ఎన్.వీ ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాహితీవేత్త కూరెళ్లకు ఢిల్లీ నుంచి ఆహ్వానం

ప్రధానమంత్రి మన్‌కీ బాత్ వంద ఎపిసోడ్లు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఈనెల 26న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను రేడియో ప్రసార భారతి సీఈవో గౌరవ్ ద్వివేది ఆహ్వానించారు. భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల విఠలాచార్య గ్రామంలో తన ఇంటిని గ్రంథాలయంగా మార్చారు. రెండు లక్షల పుస్తకాలు ఉన్నాయి.

కేంద్రం సుంకాల మోత - రాష్ట్రాలకు నిధుల కోత

హైదరాబాద్, ఏప్రిల్ 19:కేంద్ర ప్రభుత్వ సుంకాల వసూళ్ల పర్వం నాలుగింతలకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వాలను వేధింపులకు గురిచేస్తూ కేంద్ర ఖజానాను నింపుకునే ప్రణాళికలు మరింత పదునెక్కగా, ఆ దిశగా సఫలమవుతున్న కేంద్ర చర్యలతో 2014నుంచి 2022కు చేరేనరికి సెస్సుల ఆదాయం రెండింతలకు చేరుకున్నది. సెస్సుల వసూళ్లు 2013-14లో రూ. 73,8890 కోట్లుకాగా, 2021-22 లో 3,18,000కోట్లకు చేరింది. పెట్రోల్‌పై సెస్సులు 2013-14లో రూ. 4712కోట్లుకాగా, 2021-22లో 30వేల కోట్లకు పెరిగింది. డీజిల్‌పై 2013-14లో రూ. 15765కోట్లు సెస్సుల రూపంలో వసూలుకాగా, 2021-22లో రూ. 95వేల కోట్లకు చేరుకున్నది. ఆర్థికంగా రాష్ట్రాలను అస్థిరపర్చే కుట్రలో భాగమే ఇదని ఆర్థిక వేత్తలు అంటుండగా, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కేంద్రం తన ఖజానాను నింపుకోవడం చూస్తే వాస్తవమేనని అంటున్నారు. సెస్సుల పేరుతో కేంద్ర ప్రభుత్వ వసూళ్ల బాదుడు ఏకంగా 4రెట్లకు పైగా పెరుగుదల సొంతం చేసుకున్నది. 2013-14తో పోలిస్తే 2021-22లో సెస్సుల పెరుగుదల 18శాతానికి పైగా పెరిగింది. గడచిన తొమ్మిదేళ్లలో పెట్రో, డీజిల్‌పై కేంద్రం పన్నులను విపరీతంగా పెంచింది. పెట్రోల్‌పై పన్ను రెండునుంచి మూడు రెట్లు, డీజిల్‌పై ఐదునుంచి పది రెట్లు పెంచింది. 2014లో పెట్రోల్‌పై లీటర్‌పై రూ. 9.48ఉండగా, 2022లో రూ. 32.98కి, డీజిల్‌పై లీటర్‌పై 2014లో రూ. 3.56ఉండగా, 2022లో రూ. 31.83కు పెంపుదల వర్తింపజేశారు.

చైనాను అధిగమించిన భారత్ జనాభా

- 30 లక్షలు అధికమంటున్న ఐరాస గణాంకాలు

న్యూఢిల్లీ ఏప్రిల్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. చైనాను అధిగమించిన భారత్‌లో ప్రస్తుతం 29 లక్షల మంది అధికంగా ఉన్నారని ఐక్యరాజ్యసమితి గణాంకాలు వెల్లడించాయి. స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్, 2023 పేరుతో ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ నివేదికను విడుదల చేసింది. దీనిప్రకారం భారత్‌లో 142.86 కోట్ల మంది జనాభా ఉన్నారని అందులో పేర్కొన్నది. చైనా జనాభా 142.57 కోట్ల మంది అని తెలిపింది. 340 మిలియన్లతో అమెరికా మూడో స్థానంలో ఉందని వెల్లడించింది. అయితే చైనాను భారత్ ఎప్పుడు అధిగమించిందనే విషయాన్ని స్పష్టం చేయలేదు.

2023 ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఈ నివేదికను రూపొందించినట్లు తెలుస్తున్నది.ప్రపంచ జనాభాలో (804.5 కోట్లు) మూడింటా ఒక వంతు ఈ రెండు దేశాల్లోనే ఉన్నదని పేర్కొన్నది. అయితే చైనా జనాభా గతేడాది పీక్‌కు చేరిందని, అప్పటి నుంచి తగ్గుతూ వచ్చిందని, ఇండియా జనాభా మాత్రం పెరుగుతోందని వెల్లడించింది. గత ఆరు దశాబ్దాలో తొలిసారిగా 2022లో చైనా జనాభాలో తగ్గుదల నమోదైంది. అయితే 2011 నుంచి భారతదేశ జనాభా ఏటా సగటున 1.2 శాతం వృద్ధి నమోదవుతున్నదని తెలిపింది.ఇక భారతదేశ జనాభాలో 0 నుంచి 14 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వారు 25 శాతం ఉన్నారని, 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్కులు 18 శాతం, 10 నుంచి 24 ఏండ్ల మధ్య వయస్కులు 26 శాతం ఉన్నారని దేటా వెల్లడించింది. ఇండియాలో 15 నుంచి 64 ఏండ్ల వయసు మధ్య ఉన్నవారు 68 శాతం మంది ఉన్నారని, 65 సంవత్సరాలకు పైబడిన వారు జనాభాలో 7 శాతంగా ఉన్నారని పేర్కొన్నది.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా మచ్చ ప్రభాకర్‌రావు

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా మచ్చ ప్రభాకర్‌రావును నియమిస్తూ అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి నియామకపు పత్రాన్ని అందజేశారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రతినిధులు, అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీలందరినీ ఐక్యం చేస్తూ మేనెల చివరి వారంలో హైదరాబాద్‌లో 5 లక్షల మందితో పద్మశాలి శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు మచ్చ ప్రభాకర్‌రావు తెలిపారు.

దేశపతి శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరిస్తున్న ప్రముఖులు.● కె.శివారెడ్డి దేశపతిల ఆలింగనం. ● సభలో ప్రసంగిస్తున్న దేశపతి శ్రీనివాస్, డా॥ మామిడి హరికృష్ణ, డా॥ నందిని సిధారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, విరాహత్ అలి, దాస్యం సేనాధిపతి

ఉద్యమం నుంచి ఎదిగిన వ్యక్తి దేశపతి

ఉద్యమాల్లో ఉండి మహా మనిషిగా ఎదిగిన వ్యక్తి దేశపతి శ్రీనివాస్ అని పలువురు వక్తలు కొనియాడారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన ఆయనకు మంగళవారం రవీంద్రభారతిలో అభినందన సభ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు డా॥ నాళేశ్వరం శంకరం, అధ్యక్షతన జరిగిన సభలో సుప్రసిద్ధ కవి కె.శివారెడ్డి మాట్లాడుతూ చిన్న నటుడిగా పరిచయమైన దేశపతి ప్రజల గొంతుకై కదం తొక్కాడన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా॥ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ఉద్యమంలో దేశపతి పాటలు, మాటలను తూటాలుగా పేల్చారన్నారు. బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, రచయితలు, కవులు నలిమెల్ల భాస్కర్ వారాల ఆనంద్, డా॥ గండ్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, పొట్లపల్లి శ్రీనివాసరావు, వి. శంకర్, ఘనపురం దేవేందర్, బెల్లంకొండ సంపత్‌కుమార్, కందుకూరి శ్రీరాములు, విరాహత్ అలీ పాల్గొన్నారు

నేటి కందం- నేటికి అందం

కం॥ రకరకమైన మనుజులు
సకలార్థిన తెలుగుచుంద సంభ్రమమెప్పన్
"ఒకలా ఉండే"వారికి
ప్రకటించెద శుభమ నేటి వర్ధతినమునన్॥

ఏప్రిల్ 20 'ఒకేలా ఉండేవారి' అంతర్జాతీయ దినం)
(International Look alike Day)

-రాధశ్రీ
సెల్:9494481210

తెలంగాణ బాలోత్సవం కమిటి
ఆధ్వర్యంలో
టీచర్స్ వర్క్ షాప్- 2023

ప్రారంభకులు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
శ్రీ చొక్కాపు వెంకటరమణ
బాల సాహితీవేత్త
మాస్టర్ స్టోరీ టెల్లర్

వక్త
శ్రీ ఆకెళ్ళ రాఘవేంద్ర
మోటివేషనల్ స్పీకర్
ఐఏఎస్ ట్రైనర్

వక్త
డా. సి. ఎ. ప్రసాద్
పిల్లల ప్రేమికుడు
SCERT కరికులం కమిటీ మెంబర్

25-4-2023, మంగళవారం ఉ. 9.30 గంటలకు
సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్

హెచ్ఐవి-ఏయిడ్స్ వ్యాక్సీన్ అభివృద్ధిలో పురోగతి..!

(- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037)

గత 42 ఏండ్లుగా విశ్వ మానవాళిని భయకంపితం చేస్తున్న ఏయిడ్స్ వ్యాధికి కారణమైన "హూమన్ ఇమ్యూనో డెఫిసియన్సీ వైరస్, హెచ్ఐవి"ని తుదముట్టించడానికి శాస్త్ర పరిశోధకులు ఏకాగ్రతతో అవిశ్రాం తంగా కృషి చేస్తూనే ఉన్నారు. హెచ్ఐ వి వైరస్ సోకిన బాధితులకు ఏయిడ్స్ వ్యాధి వస్తుందని మనకు తెలుసు. ప్రపంచవ్యాప్తంగా 38 మిలియన్ల హెచ్ఐవి-ఏయిడ్స్ సోకిన బాధితులు ఉన్నారని, ఒక్క 2019 సంవత్సరం లోనే 1.7 మిలియన్లకు పైగా ప్రజలకు హెచ్ఐవీ సోకిందని గణాంకాలు తెలుపుతున్నాయి. అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్ఐవీ సోకిన వ్యక్తి రక్తం ఆరోగ్యవంతుల రక్తంతో కలవ డం, గర్భిణి తల్లి నుంచి శిశువుకు హెచ్ఐవి సోకడం లాంటి కారణాల తో హెచ్ఐవి సంక్రమిస్తున్నది.

వ్యాక్సిన్ తయారీలో సంక్లిష్టత:

ఎలాంటి సరైన చికిత్స, ఔషధాలు అందుబాటు లేని కారణంగా హెచ్ఐవి-ఏయిడ్స్ ప్రాణాంతకంగా మారడంతో ప్రజలు టీకా కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రభు త్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, పౌర సమా జం అవిరళ కృషితో ప్రజల్లో అవగా హన పెరగడంతో కేసుల సంఖ్య గణనీ యంగా తగ్గడం గమనించబడింది. హెచ్ఐవి-ఏయిడ్స్, ఎబోలా వైరస్ వ్యాప్తితో భయపడుతున్న మానవాళి గుండెల మీద కరోనా పిడుగు పడ డంతో ప్రస్తుత పరిస్థితి మరింత ప్రమాదంలోకి నెట్టింది. అయినా ఒక ఏడాది లోనే కరోనాకు టీకా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవ డం జరిగింది. హెచ్ఐవి వైరస్ అతి వేగంగా పరివర్తనం (మ్యుటేషన్) చెందే స్వభావాన్ని కలిగి ఉన్నందున హెచ్ఐవి కట్టడికి వ్యాక్సీన్ అభివృద్ధి చేయడం దాదాపు అసాధ్యమని భావించారు.

టీకా అభివృద్ధిలో పురోగతి:

ఆశ్చర్యకరంగా 2021లోనే 'ఐఏవిఐ-స్క్రిప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్', న్యూయార్క్ శాస్త్రజ్ఞుల ప్రయోగ ఫలితాల ప్రకారం హెచ్ఐవి వైరస్‌ను కట్టడి చేయడానికి వ్యాక్సీన్ అభివృద్ధిలో సకారాత్మక పురోగతి సాధించామని సగర్వంగా ప్రకటించి ప్రపంచ మానవాళికి తీపి కబురు అందించింది. కరోనా వైరస్ కోసం మాడెర్నా, ఫిట్జర్ వ్యాక్సీన్ కంపెనీలు ఎంచుకున్న యం-ఆర్‌యన్ఏ టీకా అభివృద్ధి ప్రక్రియలు, మార్గాలు, పద్ధతులను అనుసరించి హెచ్ఐవి- ఏయిడ్స్ వ్యాక్సీన్ రూపొందిస్తున్నామని పరిశోధకులు వివరించారు. ఈ పద్ధతిలో విజయవ ంతంగా హెచ్ఐవి వైరస్‌కు వ్యాక్సీన్ అభివృద్ధి జరిగితే, ఇదే విధానంతో ఇన్ఫ్లుయెంజా, డెంగ్యూ, జీకా, హెపటైటిస్-సి, మలేరియాల కట్టడికి కూడా టీకాలను రూపొందిం చడానికి మార్గం సుగమం అవుతుందని నిపుణులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఐఏవిఐ-స్క్రిప్స్ సంస్థలు రూపొందించిన హెచ్ఐవీ-ఏయిడ్స్ మ్యుటేటింగ్ వ్యాక్సీన్లతో ఆంటీబాడీల అభివృద్ధిని ప్రారంభించగలిగే సామర్థ్యంగల ఇమ్యునో కణాల తయారీని ఉత్తేజపరిచడంలో కంపెనీ పాటించిన 'జర్మ్‌లైన్ టార్గెటింగ్' విధానంలో సఫలీకృతం అయ్యామని ప్రకటించారు. పరిశోధకులు చేసిన ప్రయోగాల్లో ఫేజ్-1 దశ క్లినికల్ ట్రయల్స్‌లో 48 మంది పాల్గొనగా, అందులో 47 మందిలో ఆశించిన 97 శాతం సత్ఫలితాలు కనిపించాయని తెలిపారు. హెచ్ఐవి-ఏయిడ్స్ వ్యాక్సీన్ రూపొందించే క్రమంలో ఇది ప్రారంభం మాత్రమే అని, అంతిమంగా సమర్థవంతమైన టీకా రూపొందించడానికి చాలా కృషి చేయాల్సి ఉందని అంటున్నారు. నేటి ఫేజ్-1 ఫలితాలు ఏయిడ్స్ వ్యాధికి కారణమైన హెచ్ఐవి టీకా అభివృద్ధిని ఉత్సాహంతో కొనసాగించడానికి మంచి ప్రేరణ దొరికినట్లు అయ్యిందని అంటున్నారు.

ఐఏవిఐ-స్క్రిప్స్ పరిశోధనా సంస్థతో పాటు ఇతర అంతర్జాతీయ సంస్థల పరిశోధనల ఫలితాలతో హెచ్ఐవి-ఏయిడ్స్ వ్యాక్సీన్ రూపొందించడంలో విజయవంతంగా కావాలని, ఏయిడ్స్ వ్యాధి రహిత ప్రపంచం నిర్మించబడాలని కోరుకుందాం. "ఆల్ ది బెస్ట్ టు సైంటిస్ట్స్".

దేశంలో కొత్తగా 10,542 కరోనా పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ ఏప్రిల్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : దేశంలో కొత్తగా 10,542 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 4.48 కోట్లు (4,48,45,401)కు చేరింది. ఇందులో 4,42,50,649 మంది బాధితులు మహమ్మారి నుంచి కోలుకున్నారు. మరో 63,562 కేసులు యాక్టివ్‌గా ఉండగా, 5,31,190 మంది మరణించారు. గత 24 గంటల్లో 8175 మంది కోలుకోగా, కొత్తగా 27 మంది ప్రాణాలు కోల్పోయారు.ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో 0.14 శాతం యాక్టివ్‌గా ఉన్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. రికవరీ రేటు 98.67 శాతం, మరణాల రేటు 1.18 శాతంగా ఉందని పేర్కొంది. ఇప్పటి వరకు 220.66 కోట్ల (220,66,27,758) కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించింది.

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 20-4-2023

దివిటీలు

మౌనమే ఒక భావం
మౌనమే ఒక విప్లవం
మౌనమూ శక్తియుతం
మౌనారాధన భక్తిమయం.

ఉన్నతమయిన ఆశయాలూ
సమున్నతమయిన ఆదర్శాలూ
మహోన్నతమయిన ఆలోచనలూ
మానవ మనుగడకే అందలాలూ

విద్రవీగకు అతిశయ అహంకారంతో
సంశయ సందేహాలను విడనాడు
అసాధ్యాన్ని సాధించు ప్రయత్నంతో
కృషితో నాస్తి దుర్భిక్షం శ్రమించినచో

కష్టకాలంలో నీకు తోడు నీ ధైర్యమే
నీ ఉన్నతికి చేదోడు క్షమాగుణమే
ధర్మావలంబనలే నీ వ్యక్తిత్వ సారథులు
కలిసి ఉంటే మనిషికి మంగళకరములు

మూర్ఖత్వంతో నిండిన మూఢత్వం
అంధకారంలో మునిగడిన మానవత్వం
కరుణను తుడిచేసే క్రూరత్వం
వదిలించు విద్వత్తు చాతుర్యం.

ప్రజారాజ్యమే స్వాతంత్ర్య భారతం
అంబేద్కర్ పరిశోధనల సారాంశం
మార్గదర్శియై నిలిచిన అన్వేషణం
ఈనాటి యువతకు అవసరం.

ప్రకృతినే వంచించిన కాఠిన్యం
ప్రకృతిపై చేసిన విధ్వంసం
ప్రకృతినే ముంచిన కాలుష్యం
మానవ మనుగడకే వినాశనం.

-పి. పద్మావతి
సెల్:9652446264

నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-13)

అంతులేని ప్రేమ చూపిస్తున్న పెనిమిటి
అనంతమైన దుఃఖాన్ని కానుకగా ఇచ్చిన ప్రకృతి
ఏదీ శాశ్వతం కాని జీవితం
బతికున్నంత కాలం భరించడమే అనుభవం.

దేశం మీద చక్రం బట్టుకుని తిరుగుతున్నప్పుడు
వానికేం? గుండ్రాయి లాగా
బాగానే ఉన్నాడనుకొని
బండరాయిలా బతికేసింది

ఇప్పుడు...
నీవే నా జీవితం - నీ తోడిదే నా బతుకు అంటూ
ప్రేమ పావురమై తిరుగుతూ
కాళ్లిరిగి కళ్ళ ముందరనే పడిపోయినాడు
ఉన్నాడని మురిసిపోలేదు
కదలకుండా పడి ఉన్నాడని ఏడుస్తూ కూర్చోలేదు!

ఎవరైనా ఎంతకాలం సానుభూతి చూపిస్తారు?
సానుభూతి కడుపు నింపదు
అందులో నోళ్లన్నోం.. నొసళ్లన్నోం...
పొట్టూ పొల్లకాడూ కొట్టుక పోతే
మిగిలే గింజలు ఎన్నుంటయ్...
అసలుంటయా
అనుకుంటనే ఉలిక్కి పడ్డది సరయూ.

ఎదురుగా అత్తమ్మ...!
మేనత్త!
దయ్యం కనిపిస్తేనే కాదు అనుకోకుండా దేవుడు కనిపించినా
ఉలికిపాటు తప్పదు !
ఎందుకంటే - ఈమె తపస్సు చేయకుండానే
ఆమె ప్రత్యక్షమైంది!
అత్తమ్మ కొంగులోకి ఒంపిన కన్నీళ్లు
ఆమె గుండెలోకి చేరినై
ఈమె బరువు ఆమె మీదికి ఒరిగింది
తల్లి లేని తనకు తల్లిని మించిన ఆదెరువయ్యింది
అత్తమ్మ పేరు పోచమ్మ!.

ఊరు బయట ఉండి పోచమ్మ తల్లి
ఎంతమందిని కాపాడుతున్నదో తెలవదు!
అత్తమ్మ మాత్రం
'నీ ఆపదలో నేనున్నా'నని ఆలింగనం చేసుకున్నది!
'నీ యెత కత తెలిసి
ఉండలేక వచ్చిన!
బిడ్డలు లేని నాకు నీవే బిడ్డవు! అనుకున్నది పోచవ్వ.

సావు బతుకుల మధ్యనున్న నాకు
తోడుగా నీడగా నిలవడ నీకే వచ్చినవు!
తల్లి లేని నాకు నీవే తల్లివి! అనుకున్నది సరయు.

ఆ రాత్రి
క్షణాలను గుండెల్లో అదిమి పట్టుకొని
ఓదార్పు చూపులతో కాపాడుకున్నారు.

వీళ్ళ మాటలకు మౌనసాక్షి
మంచం మీద కదలకుండా పడి ఉన్న దర్శనం కన్నీళ్లు
ఇట్లా అనుకున్నయ్...
ఈ తల్లి గాని తల్లి - బిడ్డ గాని బిడ్డ 'సల్లగుండాలె' అని
చంటి పిల్ల ఏడుపు
వాళ్లను వాస్తవంలోకి లాగింది

-దోరవేటి
సెల్:9866251679

సునందామృతం

కదళీ కంటక న్యాయము-4

కదళీ అనగా అరటి చెట్టు. కంటకము అంటే ముల్లు.

కదళీ దళము లేదా ముల్లు అరటి ఆకు మీద పడినా, అరటి ఆకు ముల్లు మీద పడినా అరిటాకుకే నష్టం కష్టం జరుగుతుంది. అందుకే ఈ విధంగా అరిటాకుకు జరిగే అనర్థాన్ని కదళీ కంటక న్యాయము అంటారు. ఇదే అరిటాకు ముల్లు సామెతగా కూడా చెప్పవచ్చు.

ఈ న్యాయాన్ని మరో రకంగా "కంచెపై చీర పడినా, చీరపై కంచె వచ్చి పడినా చిరిగేది చీరే అంటారు.

అరిటాకు ఎంతో సున్నితమైనది కదా! అందుకే ఆడపిల్లను అరిటాకుతో పోలుస్తూ ఉంటారు.

మానాభినాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని పెద్ద వాళ్ళు ఆడపిల్లలకు చెబుతుంటారు.

ముళ్ళలాంటి దుర్మార్గులు, దుష్టాలోచన కలిగిన వ్యక్తుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారిని అమాయకంగా నమ్మడమో లేదా వారి ప్రలోభాలకు లొంగిపోవడమో చేస్తే కదళీ కంటక న్యాయములా మోసపోయేది జీవితాన్ని కోల్పోయేది ఆడపిల్లే.

అందుకే పెద్ద వాళ్ళు ఆడపిల్లలకు తరచుగా చెప్పే జాగ్రత్తల్లో ఈ న్యాయాన్ని ఉదహరించడం పరిపాటి.

ఆడపిల్లలే కాదు. ఎవరైనా సరే స్నేహం చేసే విషయంలో కూడా ఈ న్యాయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిది.

ప్రస్తుతం రకరకాల వ్యామోహాల మాయాజాలం మన చుట్టూ విస్తరించి ఉన్నది. దానికి ఆకర్షితులమైనా లేదా మనల్ని ఆకర్షించేలా చేసినా గుడ్డిగా నమ్మితే అన్నీ కోల్పోవడమే. అందుకే ఈ "కదళీ కంటక న్యాయము"ను గమనంలో ఉంచుకొని అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

-పురిమళ్ల సునంద
9441815722

బాల్యం

-మొగ్గలు

అమ్మ చేతి ముద్దలను తింటూ
జాబిలమ్మ పాటలను వింటూనే
చిలుక పలుకులు నేర్చేదే బాల్యం.

నాన్న చిటికెన వేలు పట్టుకుని
బుడి,బుడి నడకలు నేర్చుకునే
నడవడికకు నాందీ ప్రస్థానం బాల్యం.

అమ్మమ్మ కమ్మని కథలు వింటూ
బంధాలకు గట్టి పునాదులు వేస్తూ
భారత పౌరునిగా తీర్చిదిద్దేది బాల్యం.

తాతయ్య అనుభవాలను కంటూ
బాధ్యతలను పరిచయం చేస్తూనే
ఉన్నత విలువలను నేర్పేది బాల్యం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

పుస్తక సమీక్ష

సమాజ దర్శనం.. జిందం అశోక్ కవిత్వ మూలం

జిందం అశోక్ కవిత్వానికి కొత్తేం కాదు. గత రెండు దశాబ్దాలకు పైగా కవిత్వ మథనం చేస్తున్న అశోక్ తన ఆరవ కవితా సంపుటిని 56 కవితలతో తీర్చిదిద్ది 'వర్గమూలాలు' అని నామకరణం గావించాడు.

'వర్గ మూలాలను' శోధించడ మంటే సమాజాన్ని లోతుగా అధ్యయ నం చేయడమే. సమాజంలోని లోటు పాట్లని, మనిషి ఎదుర్కొంటున్న ఆటు పోట్లని వెలికి తీసి కారణాలు ఎత్తి చూపడమే. సమాజమంటే మనిషేగా!!

అమాయక ప్రజల ఆలోచనా విధానాన్ని ఎలా వ్యక్త పరుస్తున్నాడో చూడండి.,,..

"చెరువు కట్టమీద
పచ్చని చెట్టు
పిట్టల దండు వాలింది
కాల్పులు జరిగితే..
అన్నీ తప్పించుకున్నాయి
రెండు చనిపోయినవి".

యిదో వాదన!

"ఎన్‌కౌంటర్‌ను కూడా
ప్రభుత్వ సంక్షేమ పథకంగా
స్వీకరిస్తున్న సబ్సిడీ బతుకులు"
"అడవి ఒడిలో
పచ్చని చెట్టు
పిట్టలు.. వాలలేదు..!
కాల్పులు జరిగినవి
ఒకే ఒక్క సమాధానం
ఎనిమిది పిట్టలు నేల
కొరిగినవి"



యిది మరో వాదన!!

'ఎన్‌కౌంటర్' పేరిట జరుగు తున్న రాజ్యాహింసను ఎంతో గొప్ప గా చెప్పిన వాక్యాలు యివి. అసలు లెక్క ఎప్పటికీ తేలదు. ఎన్నేళ్ళ యినా.. కాల హరణమేగాని బాధ్యు ల్ని న్యాయస్థానాలు సమాజం ముందు నిలబెట్టలేని ఆశక్తత! న్యాయమూ..చట్టమూ వేరు వేరు మరి.

"అవినీతి మంటలకు
అధికారుల అమ్మజని
ఎక్కువవుతుంది
రాజకీయ రంగు మారుతుంది
ధర్మం అవిటిదవుతుంది"

సమస్య మూలాల్లోకి దూసుకెళు న్నాడు. పరిహారం కూడా సూచిం చాలిగా..

"ఒకే ఒక గొంతుకగా నినదిం చాలి
ఒక్కొక్క అడుగు
ఒక్కొక్క పిడికిలి
సమసమాజ నిర్మాణానికి
పునాది రాళ్ళు కావాలి" యిన్ని జరగాలంటే ఏం కావాలి?

"మొదట మనం మారాలి
తర్వాత సమాజం
ఆ తర్వాత కాలం దానంతట
అదే మారుతుంది" యిదీ కవి ప్రతిపాదించే సిద్ధాంతం.

"క్షణ క్షణం చస్తూ బతకడం
బతుకుతూ చావడం
రెండూ దండగే" కాస్త కటువుగా ధ్వనించినా అక్షరసత్యం యిది.

ఈ మధ్య టీవీ ఛానళ్ళలో చర్చల పేరిట జరుగుతున్న రచ్చను మనం గమనిస్తూనే వున్నాం. అనభ్య పదజాలంతో దూషించుకోవడం, చెప్పుల్తో కొట్టుకోవడం.. యిదంతా ఓ వినోదంలా Live లో Telecast చేయడం. వీళ్ళందరూ అనామకులేం కాదు. సమాజంలో మేధావులుగా చెలామణీ అవుతున్న పెద్ద మనుషులు. విశ్లేషకులు కాదూ. విషం చిమ్మే మిషన్లు.

"వినడానికి చూడటానికి బాగా లేకున్నా
వార్త ప్రసారాలు
తిట్టుకొని ఉమ్మి వేయడానికి ఎంత బాగుంటయో" అశోక్ ఎంత సౌమ్యం గా చెప్పినా అంతర్లీనంగా వినిపిస్తున్న వెటకారం గమనార్హం.

"ప్రైమరీ క్లాస్ పిల్లగానికి
ఎర్రని పెదవుల టీచర్
నాభి కిందికి చీరకట్టిన ఆంటీ
పిక్కలు మీదికి ప్యాంటు వేసిన పింకీ
పెరిగి పెద్దైన తర్వాత
కలల కౌగిట్లో.. ఉక్కిరి బిక్కిరిచేసే
అందాల ఉత్ప్రేరకాలు" వెర్రి తలలు వేస్తున్న విదేశీ విష సంస్కృతి యువతపై చూపిస్తున్న దుష్ప్రభావానికి యిదో మచ్చుతునక. మరింత వ్యాఖ్యానం అక్కర్లేదనుకుంటాను.

నేత కార్మికుల వెతలను దృశ్యమా నం చేస్తు కడు హృద్యమైన కవితలు ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి.

యిందులోని 'భజన' 'ముంబయి వన్' మాస పత్రికలో 2011 సం॥లో అచ్చయిన కవిత. ముంబయి నగరంలో ఏకైక తెలుగు సాహిత్య పత్రికగా అచిర కాలం తెలుగు కవు లను, రచయితలను యితోధికంగా ప్రోత్సహించిన గొప్ప పత్రిక. ఈనాడు విశిష్ట కవులుగా వెలుగొందుతున్న చాలా మంది 'ముంబయివన్'లో రాసినవారే.

"చిన్న నాటి పత్రికల్లో
వెతుకు
నేటి కవుల పునాదులు
అక్కడే సుమా!" నేను ఎప్పుడో రాసుకున్న 'నానీ' గుర్తుకొచ్చింది.

''తెగిన పేగు'' ''హరి నామస్మరణ'' అనే స్మృతి కవితల్లో కవి జిందం అశోక్ పండించిన ఆర్ద్ర పాఠకుల హృదయాలను తడి చేస్తుందనడంలో సందేహం లేదు.

ప్రపంచీకరణ, పట్టణీకరణ, గ్లోబలైజేషన్, ఆధునీకరణ పేరేదైతేనేం.. వాటి ముసుగులో ధ్వంసమవుతున్న పల్లె బతుకులు, ఛిద్రమవుతున్న కుల వృత్తులు, పేదల ఆత్మ క్షోభలు పలు కవితల్లో వినిపించిన తీరు కవి నిశిత పరిశీ లనా దృష్టిని పట్టి యిస్తుంది. వస్తు వైవిధ్యం బాగుంది. వ్యక్తీకరణలో కలం బలం తొణికిసలాడింది. కానీ 20సం॥ల అనుభవంవున్న కవి జిందం అశోక్ నుండి మరింత పరిణత కవిత్వం ఆశించడంలో పాఠకుల తప్పు లేదనుకుంటాను. ఏమంటారు అశోక్?

ప్రతులకు: జిందం అశోక్
ఇ.నెం.8-5-492/5/2
పోచ్చమ్మవాడ, కోచిరాంపూర్
కరీంనగర్-505 004
సెల్:8978532225

- రమణ వెలమకన్ని
సెల్: 9866015040

ఎక్కడ ...

వాలని కనురెప్పల మీద వద్దన్నా వాలుతూ
గడచిపోయిన క్షణాలు
పగలంతా రంగుటద్దాలు పెట్టుకుని , చిరునవ్వులు చుట్టుకుని
లోలోపల దాచేసుకున్న రహస్యం ఒకటి
చీకటి అండ చూసుకుని చివాల్న తలపైకెత్తి నిలదీస్తుంది.
తలవాల్చకుండా తగ్గకుండా ధీటుగా నిలబడిన స్థైర్యం

ఒక్కసారి వెన్నుముక కరిగి నీరైపోయినట్టు
కుప్పకూలి లుంగ చుట్టుకుపోయి కనిపించని సముద్రమవుతుంది.
అదృశ్యంగా అడుగులో అడుగేస్తూ అనుసరించిన విషాదం
ఒక్కసారి ఊపిరి పుంజుకుని చూపు సవరించుకుని
అణువణువునూ కొత్తగా పలకరిస్తుంది.

గాలితాకిడికే కదిలే అలలా చలించే మెత్తని సౌకుమార్యం
కత్తిలా మారి కాస్త కాస్త ప్రాణాన్ని కోసి ఇస్తున్నా
చుక్క రక్తం లేకుండా పాలిపోయిన జీవం పేలవపు నవ్వు
జీవచ్ఛవమై రోజులకు రోజులు కాళ్ళీడ్చుకుంటూ కదిలే వేళ
ఎప్పుడో కరిగిపోయిన మేఘం వెచ్చని ఆవిరై పలకరిస్తూ

అదృశ్యగతాన్ని అరచేతిలో నిలిపినప్పుడు
ఇది జీవితమో జీవనానంతర ఘట్టమో కాని
దృశ్యాదృశ్యంగా సమస్తం చర్విత చర్వణమే.

లోలోపల పరుగులు తీస్తున్న ఈ ప్రవాహం నువ్వో నేనో
నువ్వూ నేనూ లేని అనంతానంత భావనో
కనురెప్ప వాలితే కథ ఎక్కడో కంచి ఎక్కడో...

-స్వాతీ శ్రీపాద,
8297248988

నవయాన గమనమే నేటి జీవన మార్గం



-డా.కత్తి పద్మారావు
9849741695

జీవితం భవిష్యత్తులో ఉంది
ఎక్కడో ఒకచోట యుద్ధం
జరుగుతూనే ఉంది
దేశ దేశాలకూ మధ్య
ఖండ ఖండాలకూ మధ్య
యుద్ధం జరుగుతుంది
తనలో తనకే
యుద్ధం జరగడం లేదు
ప్రేమ మీద క్రోధం గెలుస్తుంది
జ్ఞానం మీద మౌఢ్యం దాడి చేస్తుంది
సున్నితమైనవన్నీ గాయానికి
గురి అవుతున్నాయి
వాడు నటించీ నటించీ
జీవితంలో జీవించటం మరిచిపోయాడు
అబద్ధాలు చెప్పీ చెప్పీ
నిజం మరిచిపోయాడు
జలపాతాల్లో నీళ్లు పైనుండి కిందకు
జారుతున్నట్టు కనిపిస్తాయి
కానీ అక్కడ సరస్సు ఏర్పడుతుంది
కళ్ళు అనేక కావ్యాలు
రాస్తూనే ఉంటాయి
నిశ్శబ్దంలో ఎన్నో అలంకార శాస్త్రాలు
చిత్రితమయ్యాయి
సూర్యుడు ఆ చెట్టుకొమ్మల నుండి
జొరబడి భూమిని ముద్దాడుతున్నాడు
నేల పులకరించి
మొక్కను కంటుంది
నిజమైన ప్రేమికులు వారు
వ్యక్తావ్యక్తమైన వన్నీ
ఘర్షణకు గురవుతున్నాయి
అనుబంధంలో అక్షరాలు అలిసిపోతున్నాయి
ఆత్మీయత అందనంత
లోతుల్లో ఉంది
ప్రయాణం అంతటిలో
గుంతలు గుంతలు
అవును!
వారి నవ్వుల్లో కాగితపు పూలు రాలిపోతున్నాయి
వారు నవ్వును నేర్చుకున్నారు
ఏడుపు నేర్చుకున్నా..
వారికి రావడం లేదు
భావోద్వేగాలు వారు మరిచిపోయారు
వారు కృత్రిమ జీవులు
రోబోలు వారిని చూసి
హావ భావాలు నేర్చుకుంటున్నాయి
వారు ఎంతటి మోసాన్నైనా
నవ్వుతూ చేస్తారు
వీరేమిటి?
అప్పుడే దగ్గరై
అప్పుడే దూరమవుతున్నారు?
కాలం చాలా విలువైనది
గడిచిన క్షణం తిరిగి రాదు
నడుస్తున్న కాలాన్ని గుర్తుంచుకోవాలి
వర్తమానం నీకు ఆయువు
వెదురును తాకి
గాలి ఈల అవుతుంది
నీటి తరంగాల నుండి కూడా
కొత్త రాగాలు వినిపిస్తున్నాయి
ఆ కొండమీద పడుతున్న
వాన చినుకు
కొత్త కవిత చదువుతుంది
వేళ్ళకొనలు శృతిబద్ధంగా ఆడినంత
స్వరం పలకడం లేదు
కడలి కదలకుండానే
సూర్యుణ్ణి మింగుతుంది
చంద్రుణ్ణి కంటుంది
నక్షత్రాలు అలలపై
ముగ్గులేస్తున్నాయి
ఆ ఏటి ఒడ్డున చెట్టుకొమ్మన
ఒకే ఒక పక్షి
జీవన గానం చేస్తుంది
తనలో తానే చేసే పోరాటంలో
దేనితో గెలుస్తున్నారు?
దేనితో ఓడుతున్నారు?
స్వరానికి భాషా భేదం లేదు
ఆకాశమంతా ఆ రాగం అల్లుకుంది
జీవితం లేకుండా
ఎంత మాట్లాడినా
అవి పొడి పొడి
ధ్వనులే అవుతాయి
మతోన్మాదం కత్తి నూరుతుంది
దినదినం రుధిరస్రావం
ద్వేషం వధగా మారుతుంది
కులాలు, మతాలు అన్నీ
నీనుండే పుట్టాయి
నీవే వాటిని రద్దు చేయగలవు
నీవు సృష్టించిన దానికి
నీవే బలి అవుతున్నావు
కలకత్తా కాళికాదేవి
మళ్లీ కళ్లు ఎర్ర చేసింది
ఆ దేవేరి నగలు
దొంగలు ఎత్తుకెళ్లారు
తమను తాము కాపాడుకోలేని
దేవుళ్ళు, దేవతలు
మిమ్మల్ని ఎలా కాపాడతారు?
మతం పేరుతో
జాతరలు, కొలుపులు
పూజ మందిరాల్లోనే
గొంతు నులుముతున్న సవ్వడి
అవును!
మళ్లీ నైతిక జీవన గమనం
వైపు చూద్దాం.
బుద్ధుడు నడయాడిన నేల సుమా!
బుద్ధుడు త్యాగాన్నిచ్చిన
భూమి ఇది.
అతడు రాజ్యం ఇచ్చాక
ప్రపంచం అంతా
అల్లుకున్న ఆదర్శ జీవి అయ్యాడు
ఆ మార్గంలో అంబేద్కర్
ఆకాశమంత ఎదిగాడు
అంబేద్కర్ బాటలో
అక్షర ధ్యుతులు వెలిగాయి
ఆయన మాటలు వెన్నెల బాటలు
ఆయన సూక్తులు
దేశానికి శాసనాలు
ఆయన చరిత్రను
మార్చి బోధకుడు
అందుకే ఆయన
నవయాన బౌద్ధుడు
మళ్లీ వారి మార్గంలో
ప్రేమను పండిద్దాం
నవయాన గమనమే
నేటి జీవన మార్గం.

ఎ.బి.బి.యస్.యస్ జాతీయ అవార్డుల ప్రదానం

డా॥ కల్వకుంట్ల రామకృష్ణకు "భారత్ భాషా భూషణ్", డా॥ బి. జయరాములకు "రాష్ట్ర భాషా గౌరవ్ సమ్మాన్" అవార్డుతో సత్కరిస్తున్న తంగిరాల చక్రవర్తి, కె.శివారెడ్డి, కడారి సత్యమూర్తి, బైస దేవదాసు, ఆచార్య సాగి కమలాకర శర్మ, జి. పద్మావతి.

తెలుగు సాహిత్యం అన్య భాషల్లోకి ముఖ్యంగా హిందీలోకి అనువాదాలు కావాలని, ప్రజాసాహిత్యానికి చేరువగా కలాలు కదలాలి అంటూ అవార్డు గ్రహితల్ని అభినందిస్తూ కవులకు ప్రాంతాలు ఎల్లలు లేవని జీవన సారాన్ని కవిత్వీకరించాలని ముఖ్య అతిథి సుప్రసిద్ధ కవి, కేంద్ర సాహిత్య అకా డమీ అవార్డు గ్రహిత కె.శివారెడ్డి అన్నారు.

శుక్రవారం సా॥ 6 గం॥ అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ ప్రాంతీయ సభలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది.

ఈ సభకు ఆచార్య ఎస్.సత్య మూర్తి దక్షిణ భారత దేశ అఖిలభారత ప్రారంభకులుగా సభ పరిచయం చేసారు. నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, కమలా కర శర్మ, రమేష్‌కుమార్ జాదవ్, బి.రామమూర్తి, బి. సూర్యప్రకాష్, గోళ్ళమూడి పద్మా వతి, తంగిరాల చక్రవర్తి అతిథులుగా పాల్గొన్న ఈసభ లో అఖిల భారత భాషాసాహిత్య సమ్మేళన అవార్డు గ్రహితలను అబి నందించారు.

డా॥బి. జయరాములు (రాష్ట్ర భాషా గౌరవ సమ్మాన్), డా॥.పులిగడ్డ విజయలక్ష్మి (సరస్వతి సమ్మాన్), డా॥.టి.వి. సుందరవల్లి శ్రీదేవి (సరస్వతి సమ్మాన్). డా॥ కె. రామకృష్ణ (భారత్ భాషా భూషణ్), డా॥.పుట్టపర్తి నాగ పద్మనీ(భారత్ భాషా భూషణ్), వి. రఘుశ్రీ (భారత్ భాషా భూషణ్), కె. లలిత-పి. లలితావాణి (సాంస్కృతి భూషణ్), బి. లలితాకుమారి, డా॥ తిరునగరి శరత్‌చంద్ర, కె.ఎల్. కామేశ్వరరావు (సాహిత్యశ్రీ), కుమారి ఇందిరారాణి (సమన్వయశ్రీ), గజవెల్లి దశరథరామయ్య (సమన్వయశ్రీ). డా॥ వి.కె. ఆనంద్ ప్రభు (డా॥పోతుకూచి సాంబశివ రావు ఎక్స్‌లెన్సీ అవార్డు), శ్రీ తంగి రాల చక్రవర్తి (శ్రీ సతీష్ చతుర్వేది లైఫ్ టైం లిటరరీ అవార్డ్), గోళ్ళ మూడి పద్మావతి, (శ్రీమతి సుమన్ చతుర్వేది రాష్ట్రీయ స్మృతి అలంకరణ్ అవార్డ్) ఆడువాల సుజాత (శ్రీమతి ప్రేమ చతుర్వేది స్మృతి అలంకరణ్)లకు అవార్డుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గోళ్ళమూడి పద్మవతి, తంగిరాల చక్రవర్తి సమన్వయం చేసారు. ముందుగా జరిగిన కవి సమ్మేళనంలో శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని, పద్మావతి, కె. లలిత, అడువాల సుజాత, డా॥పులి గడ్డ విజయలక్ష్మి, లలితవాణి, శరత్‌చంద్ర తిరునగరి, ఎమ్. నాగేశ్వర్రావు, రఘుశ్రీ, గుళ్ళపల్లి ఆంజనేయులు, కె.ఎల్. కామేశ్వర రావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎక్కణ్నుంచో ఈ దరికి..

భూమికీ ఆకాసానికీ
ఏదో దోస్తానా వుందీ
లేకుంటే...
అక్కడెక్కడో
రాతిరి మబ్బుల్లోనుంచీ
చందురుడు వెన్నల కురిపిస్తే
ఇక్కడ నయనానంద దృశ్యం
మనసంతా వెండి జాబిలి పారవశ్యం
చీకట్లను చీల్చుకొని
అక్కడెక్కడో సుదూరాన
సూరీడు పొడుస్తే
ఇక్కడంతా
వెలుగు రేఖల సందడైతది
బద్ధకాన్నీ నిద్దురమత్తును
చద్దర్లోనే సర్దేసుకొని
మేలుకొలుపుల జాతర పాటొస్తది.

మనం ఎక్కడున్నమన్నది
ప్రశ్నే కాదు..
ఎంత వరకు వ్యాపించామన్నదే ముఖ్యం
గగనం నుంచి జారిన వర్షపు చుక్క
పుడమిని ముద్దాడి
విత్తును మొలకెత్తిస్తుంది చూడు.

నువ్వెక్కడో వున్నవని దిగులొద్దు
ప్రసరించు...ప్రభవించు నలుదిశలా
నీ తాలూకు పరిధులన్నింటినీ తడుము
అదిగో
ఎక్కణ్నుంచో పాయలు పాయలుగా
ప్రవహిస్తున్న జలం
ఈ నేలను తాకుతూ వెలుతుంది
పురాస్మృతుల్ని
తనలో కలిపేసుకు పోతుంది చూడు..!

-డా.కటుకోర్వుల రమేష్,
సెల్:9949083327

ఎక్కడ ...

ఒక్కసారి వెన్నుముక కరిగి నీరైపోయినట్టు
కుప్పకూలి లుంగ చుట్టుకుపోయి కనిపించని సముద్రమవుతుంది.
అదృశ్యంగా అడుగులో అడుగేస్తూ అనుసరించిన విషాదం
ఒక్కసారి ఊపిరి పుంజుకుని చూపు సవరించుకుని
అణువణువునూ కొత్తగా పలకరిస్తుంది.

గాలితాకిడికే కదిలే అలలా చలించే మెత్తని సౌకుమార్యం
కత్తిలా మారి కాస్త కాస్త ప్రాణాన్ని కోసి ఇస్తున్నా
చుక్క రక్తం లేకుండా పాలిపోయిన జీవం పేలవపు నవ్వు
జీవచ్ఛవమై రోజులకు రోజులు కాళ్ళీడ్చుకుంటూ కదిలే వేళ
ఎప్పుడో కరిగిపోయిన మేఘం వెచ్చని ఆవిరై పలకరిస్తూ

అదృశ్యగతాన్ని అరచేతిలో నిలిపినప్పుడు
ఇది జీవితమో జీవనానంతర ఘట్టమో కాని
దృశ్యాదృశ్యంగా సమస్తం చర్విత చర్వణమే.

లోలోపల పరుగులు తీస్తున్న ఈ ప్రవాహం నువ్వో నేనో
నువ్వూ నేనూ లేని అనంతానంత భావనో
కనురెప్ప వాలితే కథ ఎక్కడో కంచి ఎక్కడో...

-స్వాతీ శ్రీపాద,
8297248988

అస్కారుకోకిల

ప్రపంచ సినిమాకొమ్మ మీద
ఈసారి, ఆస్కారుకోకిల తెలుగుపాటను ఎత్తుకున్నది,
ఎన్ని మధురపదాల చిగురులను తిన్నదోగానీ
పెదాలపై తీయని కీర్తిసుధల హత్తుకున్నది,

నాటునాటు అంటూనే తెలుగుదనం నాటేలా
నాటి కథల చెబుతూనే
తెలుగుఖ్యాతి చాటేలా
ఫాస్టుబీటు వేస్తూనే మన
పల్లెగుండె మీటేలా,
మన వంటల సొగసులు ప్రపంచాన్ని చుట్టేలా
మన తిండ్ల రుచులన్నీ
జగతికంతా పట్టేలా
మన రోషం ఎగిసిఎగిసి మీసం మెలిపెట్టేలా
మన ఆటలు మనపాటలు
కదిలి గజ్జెకట్టేలా
మన దరువులు మన పరువుల దద్దరలు పుట్టేలా
మన భాష మన యాస
నచ్చి గెలుపుపాట కట్టేలా,

పాటల చలనచిత్ర చరిత్ర ఇపుడు చంద్రబోస్ అయ్యింది
సంగీత రచనాబాణీ కీరవాణి అయ్యింది,
ఉగాది తెలుగువారందరికీ కానుక
ఐతే, ఈ ఆస్కారు తెలుగువారందరూ
ఉగాదికి ఇచ్చిన కానుక !

-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

రామరాజ్యం

మానవత్వం మనుగడలో లేకుండా
కులం మతం పేరుతో మారణ హోమాలు
ఆర్థిక బలంతో పేదవాన్ని
ధనికులు దోచుకుంటూ?
పెద్ద చిన్న తేడా లేక
మాటల అస్త్రాలు వదులుతూ
'స్త్రీలను గౌరవిద్దాం' అన్న పదాలు
బోర్డులకే పరిమితమవుతే
రాజకీయ కుతంత్రాలతో ఒకరికొకరు
అణగ తొక్కుతూ?
ఆడపిల్లలపై అమానుషాలు
అనునిత్యం అవుతూ?
ఉన్నవాడు పేదవాడినే గౌరవిస్తూ
అందలమెక్కిస్తుంటే?.
కన్నవారిపై కనికరం చూపక
వృద్ధాశ్రమాలకు అంకితం చేస్తే?
అధిక సంపాదన ఆశతో
దేశాన్ని వదిలి విదేశాలలో చేరితే
ఉన్న ఊరు, కన్నతల్లిని మరిచి
కాఠిన్యంగా ప్రవర్తిస్తే?
లంచగొండితనం వెళ్లనుకుని
మహావృక్షం అవుతే?
విజ్ఞానాన్ని డబ్బులతో కొనుక్కుంటుంటే
సమాన ధర్మం లేని అవనిపై
'రామరాజ్యం' అన్న పదం
నిఘంటువులలో సదా నిలిచిపోతుంది.

-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

నానీలు



మూడు నదుల్నైనా
సంధానించొచ్చు
ముగ్గురు మనుషుల్ని
కలపటం కష్టం.

-డా. సి. భవానీదేవి
9866847000

అస్సామీ సాంస్కృతిక బావుటా - భూపేన్ హజారికా

సాహితీసవంతి

-వారాల ఆనంద్
9440501281

దిల్ హూం హూం కరే ఘబ్ రాయే..
ఘన్ దం దం కారే
గర్ జాయే
ఏక్ భూంద్ క భీ పానీ కీ
మోరి అఖియోన్ సే బర్సాయే
తేరి ఝోరీ దారూన్ సబ్ సూఖే పాత్ జో అయే తేరా చువాన్ లాగే మేరి సూఖీ దాల్ హరియాయే
జిస్ తనకో చువాన్ తూనే అస్ తన కో చుపావూన్ జిస్ మనకో లగే నయినా వాహ్ కిసకో దిఖావూన్
ఓ మేరె చంద్రమా తేరి చాందినీ అంగ్ జలాయే ఊంచి తౌర్ ఆతారీ మైనే పంఖ్ లిఏ కత్వాయీ
.....
ఆ ఆవారా హూన్ జమీసే చత్తే ఝులక్ ది బహోతే ధరియాకి ధారా హూన్..
యహోన్ కా వహోన్ కా కహీ కా నహూ దిశా వొంకా మారరా హున్
.....
విస్తార్ హాయ్ అపార్ ప్రజా దోనో పార్
కరే హా హా కార్
నిశబ్ద్ సదా ఓహ్ గంగా తుమ్ బహతీ హాయ్ క్యోన్
నైతికతా నష్ట్ హువీ, మానవతా భ్రష్ట హువీ
నిర్లజ్య భావ్ సే బహతీ క్యాన్..

ఈ పాటలు వినగానే దుఖం, వేదన, కోపం, ఆవేశం, ఆలోచన ఒకటేమిటి అనేక భావాలు ఉత్తుంగ తరంగంగా మనలో మెదులు తాయి..మనసంతా అదుపు తప్పు తుంది.. అచేతనమయి పోతుంది.. మనసంతా కలి కలి..కలకలం..

ఒక్క మీరూ నేనే కాదు.. మన దేశమే కాదు.. సమస్త ప్రపంచమూ భూపేన్ హజారికా పాటలకూ సంగీ తానికీ దాసోహం అన్నది. మైఖేల్ జాక్సన్ ని అభిమానించిన వారు సైతం భూపేన్ స్వరానికీ, సంగీతాన్నీ .. ఊగి పోయారు. భూపేన్ దా ఈశాన్య భారతావనిలో పుట్టిన వాడు. అక్కడి సంగీతాన్నీ సాహిత్యాన్నీ, జీవితాల్నీ సంగీత ప్రపంచానికి పరిచయం చేసి ఒహో అనిపించారు.



మనుషుల్ని వారి మనసుల్నీ భూపేన్ హజారికా ఇట్టే పట్టేస్తాడు.. తన పాటల వెంట లాగేసుకుంటాడు..

హజారికా గీతాల్లో అస్సాం కనిపిస్తుంది.. ఆయన పాటల్లో ఆసామీ ప్రజలు వినిపిస్తారు.. ఆ గానంలో ఒంటరితనమూ వుంది.. సామూహిక స్వరమూ ధ్వనిస్తుంది..

భూపేన్ హజారికా కేవలం అస్సాం జానపద పాటలు పాడడు.. మొత్తంగా అస్సామీ సంస్కృతిని ఆవాహనం చేసుకుని హృదయాన్ని ఆవిష్కరిస్తాడు..

++++

'సుధాకాంత' , 'బ్రహ్మపుత్ర వాగ్గేయకారుడు'(బాలడ్ ఆఫ్ బ్రహ్మపుత్ర) గా సుప్రసిద్ధుడయిన భూపేన్ హజారిక కవి, రచయిత, సంగీత దర్శకుడు, గాయకుడు, సినిమా దర్శకుడు, జర్నలిస్ట్. అంతే కాదు ఆయనకాయనే తానో జాజాబోర్ (దేశద్రిమ్మరి) అని ప్రకటించుకున్న కళాకారుడు. అస్సామ్ జానపద సంగీతానికి కొంత శాస్త్రీయ సంగీ తాన్ని మేళవించి ప్రపంచాన్ని మంత్ర ముగ్ధుల్ని చేసారు. ఆయన రచనల నిండా మానవీయత, మతసామరస్యం, సహానుభూతి నిండి వుంటాయి. ఆయన అస్సామీ, బెంగాలీ, హిందీ భాషల్లో గానం చేసి ప్రపంచ ఖ్యాతిని ఆర్జించారు.

భూపెన్ హజారికా ఈశాన్య భారతంలో అస్సామీ చలనచిత్ర వైతాళికుడు. ఆ రాష్ట్రంలో మొట్ట దటి ఫిలిం స్టూడియో నిర్మించింది ఆయనే. ప్రపంచానికి అస్సామీ సినిమాను పరిచయం చేసింది కూడా ఆయనే.

భోపెన్ హజారికా 8 సెప్టెంబర్ 1926 న అస్సాంలోని సదియా గ్రామంలో జన్మించాడు. ఆయన పుట్టిన ప్రాంతమంతా ఆదివాసీలు నివసించే ప్రాంతం. అక్కడి మహిళలు గొప్పగా నృత్యం చేస్తూ పాటలు పాడేవాళ్ళు. బాల్యం లోని ఆ సంగీతం పాటలు భూపేన్ మనసులో నాటుకు పోయాయి. బాల్యంలోనే ఒక రోజు ఆదివాసీ మహిళలతో కలిసి వెళ్ళిపోయాడు. భూపేన్ తల్లిదండ్రులు ఆందోళనతో అంతటా వేడికి వేసారి దొరక్క పోవడంతో తీవ్రంగా ఆందో ళన చెందారు. మర్నాడు ఉదయం ఆ మహిళలే పిల్లాన్ని తెచ్చి అప్పగించ డంతో . వీడు తల్లి పాలు తాగే వాడు కదా రాత్రంతా ఎట్లా వున్నాడు. అని అడిగితే ఆదివాసీల మహిళలే తమ పాలిచ్చి పడుకో బెట్టామని చెప్పారు. అట్లా చిన్న నాటినుండే ఆదివాసీ ఆట పాటలు భూపేన్ లో అంతర్భాగమయి పోయాయి. భూపేన్ తల్లి శాంతి ప్రియా హజారికా, తండ్రి నీలకంఠ. వారి కుటుంబం లో పలువురు టీచర్లుగా పని చేసేవారు. పది మంది సోదర సోదరీ మణులలో భూపేన్ పెద్దవాడు. చిన్నప్పుడు గౌహతి, తేజ్పూర్‌లలో ఆయన విద్యాభ్యాసం సాగింది. అనంతరం బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో 1944లో బీ.ఎ., 1946లో ఎం.ఏ పూర్తి చేసాడు.

భూపేన్ కు చిన్న తనం నుండే పాటలు రాయడం పాడడం స్వభావ సిద్ధంగా అబ్బింది. ఆరవ తరగతి చదువుతూ ఉండగానే తన తొలి పాట రాసాడు. దానికి అవార్డును కూడా గెలుచుకున్నాడు. అదంతా విన్న ప్రముఖ సంగీతజ్ఞులు జ్యోతిప్రసాద్ ఆగర్వాల, విష్ణు రాభాలు హజారికాను కలకత్తా తీసుకెళ్ళి సంగీత లో శిక్షణ ఇప్పిస్తామని తీసుకెళ్ళారు. అప్పుడే బెంగాలీ సినిమాలో పాటలు పాడించారు. అట్లా మొట్టమొదటి సారి హజారికా 'జాయ్ మతి', 'శోనిత్ కున్వారీ' సినిమాల్లో పాటలు పాడి బాల ప్రతిభా శాలిగా పేరు తెచ్చుకున్నాడు. అప్పటికి తన స్వరం పూర్తిగా పరిపక్వం కాకపోవడం తో ఆయన పాడిన పాటల్ని ఆ సినిమాల్లో కథానాయి కలకు వాడారు. తర్వాత అస్సాంలో రూపొందిన మొదటి సినిమాలో పాడాడు. అప్పటికి అక్కడ రికార్డింగ్ వసతి లేక పోవడం తో షూటింగ్ కి సమాంతరంగా పాడి విజయవం తంగా నిలిచాడు. ఇక తాను తన బనారస్ చదువులు పూర్తి అయ్యాక కొంత కాలం అధ్యాపకుడిగా పనిచేసాడు. ఆతర్వాత ఆకాశవాణిలో చేరాడు. అనంతరం హజారికా కు స్కాలర్షిప్ రావడంతో కొలంబియా విశ్వవిద్యాలయానికి వెళ్ళాడు. అక్కడ 'భారతదేశంలో వయోజన విద్యారం గంలో దృశ్య శ్రవణ పద్ధతుల్ని వినియోగించడానికి చేపట్టాల్సిన మౌలిక చర్యలు' అన్న అంశం పైన డాక్టరేట్ చేసారు. అక్కడ ఉండగానే 'జై రఘునందన్..' అన్న నృత్య గీతానికి హాజారిక స్వరాన్నీ సంగీతాన్ని సమకూర్చాడు. ప్రియంవదా పటేల్ నృత్యం చేసింది. తర్వాత పెద్ద ధనికురాలయిన ప్రియంవద భూపేన్ హజారికాను ప్రేమించి వివాహం చేసుకుందామని అడగడం తో తాను ఇప్పటికే ఒక అమ్మాయికి మనసిచ్చానని హజారికా చెప్పడంతో హతాశు రాలయిన ప్రియంవద మరి ఆమెను పెళ్లి ఎందుకు చేసుకోలేదు అని అడిగింది. ఆ అమ్మాయికి ఇప్పటికే పెళ్లి అయిపోయింది అన్నాడు భూపేన్. మరింకేముంది మనం పెళ్లి చేసుకోవచ్చుకదా అని ఆమె ప్రోత్సహిం చడం తో హజారికా అంగీకరించి ముందుకొచ్చాడు. కానీ వారి ఇండ్లల్లో ఇద్దరి పెద్దలు అంగీకరించక పోవడంతో స్నేహితులు కలిసి వారికి వివాహం చేసారు. వారిద్దరికీ 1951లో ఒక కొడుకు జన్మించాడు.

తర్వాత ఇండియా వచ్చిన భూపేన్ హజారికా క్రమంగా బెంగాలీ సినిమాలకు సంగీతం అందించడం మొదలు పెట్టాడు. 'ఏరా బతుర్ సుర్', 'శకుంతల', 'ప్రతిధ్వని', 'లోతి ఘోటి', 'చిక్మిక్ బిజిలీ', మొన్ పతి', 'స్వికరోక్తి', 'సిరాజ్' లాంటి అనేక సినిమాలకు సంగీతం తో పాటు పాటలూ పాడారు. తానే స్వయంగా 'మాహుత్ భందూరే' లాంటి సినిమాల్ని రూపొందించాడు. ఇంకా అరుణా చల్ ప్రదేశ్ లో మొట్ట మొదటి హిందీ కలర్ సినిమా 'మేరా ధరం మేరి మా' సినిమాను నిర్మించడంతో బాటు దర్శకత్వం సంగీత దర్శకత్వ బాధ్యతల్నీ తీసుకున్నారు. ఇంకా ఆయన అరుణాచల్ రాష్ట్రం కోసం ఆదివాసీ నృత్య సంగీతం లతో కూడిన 'హూం ద నన్ శైన్స్' అన్న డాక్యుమెంటరీ తీసారు. అస్సాంలోని సహాకార ఉద్యమం పైన హజారికా 'ఎముథీ సౌ లార్ కహాని' డాకుమెంటరీ ని , 'త్రూ మెలోడీ అండ్ రిథం' పేర కలకత్తా దూరదర్శన్ వాళ్ళకోసం మంచి డాక్యుమెంటరీ తీసారాయన. ఇంకా అనేక డాక్యుమెంటరీ చిత్రాలకు సంగీతం అందించడం తో పాటు నిర్మించారు కూడా. క్రమంగా ఆర్థికస్థితి మెరుగు పడింది. ఇంతలో హేమంత్కుమార్ హజారికాకు లతా మంగెష్కర్ ను పరిచయం చేసాడు. హజారికా క్రమంగా హిందీ సినిమా వైపునకు తన ప్రయాణం ఆరంభించాడు. అప్పుడు ఇండియా పచ్చిన ప్రియంవద అక్కడ హజారికకు ఇతర మహిళలతో సంబంధం వుందని భావించింది. అనేక వాద వివాదాల తర్వాత విడాకులు తీసుకుంది. కానీ చివరంటా స్నేహంగా ఉండేందుకు నిర్ణయించుకున్నారు.. కొడుకును తీసుకుని ప్రియంవద అమెరికా వెళ్ళిపోయింది.

హజారికా ఒంటరి అయిపోయా డు. అప్పుడే కలకత్తా లో హేమేంద్ర ప్రసాద్ బరూవా 'ఏకే పల్' సినిమాను నిర్మించతలపెట్టాడు. ఆ సినిమా దర్శకురాలు కల్పనా లాజ్మీ ని భూపేన్ హజారికా కు పరిచయం చేసాడు. వారిద్దరి అభిప్రాయాలూ కలిసాయి. ఆమె చివరంటా భూపేంద్ర జీవితం లోనూ, వృత్తీ ప్రవృతి లోనూ తోడూ నీడ గా వుండి పోయింది. ఇన్నేళ్ళ తర్వాత కూడా భూపేన్ హజారికా అంటే తనకెంత ప్రేమో వ్యామోహమో అందామె

ఇక హిందీ సినిమాల విషయానికి వస్తే కల్పాన లాజ్మీ తీసిన ' ఏకే పల్' సినిమాకు హజారికా అందించిన సంగీతం విశేష ప్రశంసల్ని అందుకు ది. ఆ సినిమాలో షబానా ఆజ్మి, నసీరుద్దీన్ షా, ఫరూఖ్ షేఖ్ ప్రధాన భూమికల్ని పోషించారు. అస్సామీ భాషలో వచ్చిన గొప్ప చిన్న కథల్ని ఆధారం చేసుకుని కల్పనా లాజ్మీ టీవీ కోసం రూపొందించిన 'లోహిత్ కినారే' సీరియల్ కి భూపేన్ దా గొప్ప సంగీతం అందించారు.

ఇక " రుదాలి" చిత్రం భూపేన్ దా సంగీత జీవితం లో అత్యంత ప్రభావంతమయినదిగా పేరొందింది. అందులో ఆయన అందించిన సంగీతంలో భైరవి రాగంతో కలిపి అయిదు రాగాల్ని జానపద సంగీతంతో



సమ్మిళితం చేసి సృష్టించారు. ఇందులో మొత్తం జై సల్మేర్ కు చెందిన సంగీత వాయిద్యకారులనే ఉపయోగించారు. రుదాలి కి కలపనా లాజ్మీ, గుల్జార్ లు స్క్రీన్ ప్లే రాసారు. ఆ స్క్రీన్ ప్లే ను ముందుంచుకుని ఆ సినిమాకు సినిమాటోగ్రఫీ ని నిర్వహించిన సంతోష్ శివన్ తో ఒక్కో సీన్ నూ చర్చిస్తూ దానికి తగ్గట్టుగా సంగీతాన్ని రూపొందించారు. అందుకే ఆ సినిమాలో ఏ పాటా సినిమాకు గానీ, కథకు గానీ, కథనానికి డ్రామాకి గానీ వేరుగా అనిపించదు. అన్నీ సమ్మిళిత మయిపోయి ప్రేక్షకుల్ని వాటిల్లో మమేకం చేస్తాయి. అందుకే రుదాలి పాటలు అప్పటికీ ఇప్పటికీ 'సమయ్ ఓ దీరే చలో ' అంటూ శ్రోతల్ని మమేకత్వంలో నింపేస్తున్నాయి. రుదాలి లో డింపుల్ కపాడియా,రాఖీ, రాజ్ బబ్బర్, అమ్జద్ ఖాన్ లు ప్రధాన పాత్రల్ని పోషించారు. ఆ సినిమా జాతీయ అవార్డు తో పాటు ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించింది.

ఇక అస్సామీ భాషలో వచ్చిన సినిమాల్లో అధిక శాతం సినిమాలకు భూపేన్ దా నే పాటలు రాసి పాడి సంగీతం అందించాడు. అంతే కాదు అనేక బెంగాలీ సినిమాలకు కూడా ఆయన సంగీత దర్శకత్వం వహిం చాడు. 'జీబన్ త్రిష్ణ', 'జోనకిర్ ఆలో', 'మహిత్ బందూరే', 'కారి ఓ కోమల్','పింజర్', 'దంపతి', 'చమేలి మేమ్సాబ్' లాంటి అనేక సినిమాలు అందులో వున్నాయి. హిందీ లో కల్పనా లాజ్మీ సినిమాలతో పాటు సాయి పరంజి పే తీసిన 'పాపీహా', బిమల్ దత్తా సినిమా' ప్రతి మూర్తి' లాంటి అనేక సినిమాలకు మ్యూసిక్ ఇచ్చాడు. 'మిల గాయా మంజిల్ ముజే' సినిమాను ప్లన్ చానల్ రూపొందించగా లేఖ్ టాండన్ దర్శకత్వం వహించారు. సాయి పరంజి పే సినిమా ' సాజ్' కూడా భూపెందా సంగీతం అందించాడు. పాన్ పిక్చర్స్ వారి 'దర్మియాన్' సినిమాకు కూడా సంగీతం తానే ఇచ్చాడు. ప్రఖ్యాత పేయింటర్ ఎం.ఎఫ్.హుస్సేన్ రచించి దర్శకత్వం వహించిన 'గజ గామిని' సినిమాకు భూపేన్ హజారికా అందించిన సంగీతం అద్భుతమయింది. ఇంకా లెక్క లేనన్ని డాక్యుమెంటరీలకు, టెలి సీరియల్స్ కు ఆయన సంగీతం విశేషప్రాచుర్యాన్ని తెచ్చింది. 2000 సంవత్సరంలో కల్పనా లాజ్మి సినిమా 'దమన్'కు, 2003 లో ' క్యోం' సినిమాకు కూడా భూపేన్ దా సంగీత దర్శకత్వం వహించాడు. మొత్తంగా ఆయన 36 అస్సామీ సినిమాలకు, ఎనిమిది బెంగాలీ, అనేక హిందీ సినిమాలకు సంగీతం అందించాడు.

సంగీతమే తన మొదటి ప్రాముఖ్యత 'మై ఫస్ట్ లవ్' అని చెప్పిన భూపేంద్ర' అన్న రెండు పుస్తకాలు రాసాడు.

భూపేన్ హజారికా అందుకున్న అవార్డులకు లెక్కేలేదు. ఆయనకు 1961 లో ఆసామీ సినిమా 'శకుంతలకు' జాతీయ స్థాయిలో ఉ త్తమ చిత్రం అవార్డు, 1967లో ఉ త్తమ సంగీతానికి గాను 'చమేలీ మేమ్సాబ్'కు, అవార్డులు లభించాయి. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే 'పద్మశ్రీ', 'పద్మభూషణ్', 'పద్మ విభూషణ్', లభించాయి. మరణానం తరం ఆయనకు కేంద్రం 'భారతరత్న' అవార్డు ఇచ్చి గౌరవించింది. ఇంకా సంగీత నాటక అకాడెమి అవార్డు, ఫెలో షిప్, తదితర ఎన్నో పురస్కారా లు లభించాయి

భూపేన్ హజారికా అనేక ఆరోగ్య సమస్యలతో 2011 వ సంవత్సరంలో

భూపేన్ హజారికా సినిమా సంగీతం, పాటలతో పాటు అనేక ప్రైవేట్ ఆల్బమ్స్ తో శ్రోతల్ని విశేషంగా ఆకర్షించాడు.

భూపేన్ హాజారికా అమెరికాలో ఉన్నప్పుడే పాల్ రాబ్సన్ ని కలిసాడు. అప్పుడే ఆయనకు భారతీయ జానపద పాటలకు గాను అమెరికా లో బంగారు మెడల్ లభించింది.

భూపేన్ స్వతంత్ర అభ్యర్థి గా 1967 – 73 ల మధ్య అస్సాం లో శాసనసభ్యుడిగా పని చేసారు. అయితే 2004 లో భారతీయ జనతా పార్టి అభ్యర్థి గా గౌహతి నుంచి పార్లమెం టుకు పోటీ చేసి ఓడిపోయారు.

ఆయన జీవితం, సృజనాత్మతల పైన వి.బోరా, అర్నాబ్ జాన్ దేఖా లు సంయుక్తంగా 'మొయి ఇతి జాజోబార్' (ఎ జీఎ జీ లిజీనిటవతీవతీ) పేర పూర్తి స్థాయి డాక్యుమెంటరీ మొదలు పెట్టారు కానీ కారణాంతరాల వళ్ళ అది పూర్తి కాలేదు ఈ లోగా సహదర్శకుడు అర్నాబ్ దేఖా ఆ ఫిలిం పైన. 'అన్య ఏక్ జాజోబార్', 'మోర్ సునాకే కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ హాస్పిటల్ లో చేరారు. అదే సంవత్సరం నవంబర్ 5న మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ తో తుదిశ్వాసను విడిచారు భూపేన్ హజారికా గారి అంత్యక్రియలలో అయిదు లక్షల మంది పాల్గొన్నారు. భూపేన్ హజారికా ఈశాన్యభారతం అందించిన 'బ్రహ్మపుత్ర వాగ్గేయకారుడు'(బాలడ్ ఆఫ్ బ్రహ్మపుత్ర). ఆయన గురించీ ఆయన అందించిన సంగీతం గురించీ ఎంతచేప్పుకున్నా మిగిలే వుంటుంది.

అంతరిక్షమంత అంబేద్కరుడు

అకర్షణీయ ఆజానుభావుడు
ఎవరెస్టంత జ్ఞానసంపన్నుడు
ధైర్యాన్ని తొడుక్కున్న దళితోద్ధారకుడు
వివక్షను వినికించిన న్యాయకోవిధుడు
రాజ్యాంగాన్ని అక్షరీకరించిన ఘనుడు
అస్పృశ్యతను కడిగేసిన యోధుడు !

సమస్త జగతి గర్వించే భారత రత్న
ఆత్మవిశ్వాసం ఉట్టిపడే మేధావి
రాటుదేలిన రాజ్యాంగ రూపశిల్పి
భరతమాత కన్న మేలిమి బంగారం
బడుగులకే కొండంత బలగం
నిమ్న వర్గ నిరుపేదల పక్షపాతి !

విప్లవ గళమెత్తిన సంఘ సంస్కర్త
భాగ్యనగర నడిబొడ్డున నిలిచి..
జాగతంతా కనిపించేలా..
ఆకసాన్నంటే 125 అడుగుల శక్తి
అతనికి అతనే కదా సాటి
అంబేద్కర్‌కు లేరెవరూ పోటీ !



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఆకాశమంత అంబేద్కర్‌డు

హైదరాబాదు నడి ఒడ్డున
అందమైన మహా విగ్రహం!!
ఆకాశమంత ఎత్తున అంబేద్కర్ విగ్రహం!!
అందరి మదిలో ఉండే అంబేద్కర్ విగ్రహం!!
భారత వానికి తలమానికంగా నిలిచే విగ్రహం!!
భారత రాజ్యాంగ నిర్మాత
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్!!
బహుజనుల బాంధవుడు అంబేద్కర్!!
ఆశయాల కోసం ఆరాటపడే అంబేద్కర్!!
మహారాష్ట్రలో జన్మించిన మహానీయుడు!!
అంటరానితనం నిర్మూలనే తన ధ్యేయం!!
అంబేద్కర్ అంటే ఒక అక్షర గళం!!
అంబేద్కర్ అంటే ఒక అక్షర యుద్ధం!!
మానవత విలువలను కొనియాడిన మహనీయుడు!!
న్యాయం కోసం పోరాడిన అంబేద్కర్!!
ఆశయాల కోసం పోరాడిన వ్యక్తి!!
అందరివాడు మన అంబేద్కర్!!

–దేవులపల్లి సారిక రమేశ్,
9963701294

అక్షర దివిటీ 'అంబేద్కర్'

అడుగడుగునా అవమానాలు
వెక్కిరించుకుపోయిన అసమానతలు
అగ్రకులాల ఆధిపత్యానికి అడ్డుకట్ట అత్యవసరమై
అరాచకాలను అంతంచేయ అక్షరమే ఆయుధమని
అక్షర సమరం జరిపి
వెలివాడల బతుకుల్లో అంధకారం
పారద్రోలిన అక్షర దివిటీ'అంబేద్కర్'.

పేదవాడి ప్రగతికి బాటలు వేసిన
మహోన్నతుడు
విశ్వ మానవ సౌభ్రాతృత్వం కలలుగన్న
మహనీయుడు
అసమానతల సంకెళ్ళు తెంచిన చైతన్య స్ఫూర్తి
ప్రజాస్వామ్య వ్యవస్థలో నిత్య స్మరణీయ దీప్తి.

భారతీయ స్వేచ్ఛా జీవితాలకు పునాది పత్రం
పరికించు చూడుమా!
ఏ కులానికో,
ఏ వర్గానికో,
ఏ సిద్ధాంతానికో పరిమితమా?ఆతడి దార్శనికత.
కాదు కాదు ముమ్మాటికీ కాదది
విశ్వ మానవ ఏకతయే కదా
మహనుభావుడి స్వాప్నికత.

నాటి అవమానాలనెన్నో భారంగా తలచక
భావితరాల బంగారు భవిష్యత్తుకై
అలవోకగా అనుభవించిన ఆదర్శ ప్రాయుడు
ఆతని కల ఫలించగా
రాజ్యాంగ బద్ధమైఅందరి వారు--అంబేద్కర్
ఫలాలందుకుంటున్న ఓ యువతా!
అక్షర దివిటీ 'అంబేద్కర్'
అడుగుల్లో అడుగేస్తూ సాగిపో
అక్షర సేద్యంతో జ్ఞాన సంపద బెంచుకో
అనంతమైన అందలాన్ని చేరుకో...

–కమలేకర్ నాగేశ్వర్ రావు'కమల్'
9848493223.

మహాత్ముడు పూలే

నేటి రోజున జన్మించెను
జగమున జోతీరావుపూలే..!
సామాజిక సంఘ సంస్కర్తగ
పేరొందేను మహాత్మపూలే..!!

బడుగు,బలహీన వర్గాల
ఉన్నతికై ఉద్యమించేను..!
భారతదేశంబున ప్రజలచే
మహాత్ముడనిపించుకొనేను..!!

అక్షరాలు నేర్చుకోకుంటే
బతుకులాగమవుతాయనెను.!
అక్షరాల మర్మమునెరిగి
చదువుకొరకు పోరాడేను..!!

విద్యతో విజ్ఞానమచ్చునని
విద్యాలయాలు స్థాపించెను..!
విజ్ఞానముతో తెలివచ్చునని
విద్య యొక్క విలువతెలిపెను..!!

తెలివితో సంపాదించచ్చుని
జ్ఞానం వైపు మళ్లింపచేసెను..!
సంపదతోడ సామాన్యులు
రాజ్యమును పాలించవచ్చెనెను..!!

మహిళామణులు చదువుకుంటే
సమాజాన మార్పోచ్చెననెను..!
మహిళల విద్యకోసం అతడు
సతినే పంతులమ్మగ మార్చెను..!!

సత్యసమాజ శోధకును నిలిపి
సంఘ సేవలెన్నో చేసెను..!
బాల్యవివాహాల రూపుమాప
భగవంతునిగాను వెలిసెను..!!

వితంతు పునర్వివాహాలకై
ఉద్యమాలెన్నో చేసెను..!
వివాహాలెన్నో జరిపించి
బతుకుల్లో వెలుగులునింపెను..!!

సామాజిక సమస్యలపై
సంధించెనెన్నో ప్రశ్నలను..!
సాధన దిశగా అడుగులేసి
సాధించెనెన్నో సమస్యలను..!!

తాను సూచించిన బాటలోనే
బాబాసాహెబ్ గారు నడిచెను..!
బహుజనులందరినేకంచేసి
భవిష్యత్తుకు బాటలేసేను..!!

హెచ్చు,తగ్గులను రూపుమాప
అందుకొనేను ఉద్యమమును..!
మచ్చుకైనా కల్మషమెరుగని
సామాజికుద్యమకారుడతను..!!

(ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి..)

–పసుల.శంకర్
9542181301

అందరి వారు-అంబేద్కర్

అంటరానితనము
ననుభవించి మన బొంబేద్కరుండు
దాని బెడదనుండి
ప్రజను రక్షజేయు పాటవంబును జూపి
ఘనతకెక్కినాడు గౌరవముగ

పీడితుల కొరకును ప్రీతిని పంచగ
పొత్తములను చదివి యుత్తముండు
శోధనలను జేసి సాధించు కష్టాల
యంతుచూడగాను నతడు కదిలి

లోకమంతతిరిగి లోపము లేకుండ
న్యాయవిద్యలోని నడతమార్చి
రచనజేసె ఘనము రాజ్యాంగమవ్వగ
హక్కులన్ని పంచెనందరికిని

న్యాయశాఖమంత్రి
నైపుణ్యమును జూపి
గొప్పముద్రవేసె నిప్పుగాను
మసలి పదవి కాంక్ష
మదిలోన లేకను
తుచ్ఛముగను వదిలె స్వచ్ఛమతడు

విగ్రహాల పూజ వెర్రిగ వలదని
బౌద్ధమతములోకి బుద్ధితోడ
చేరినాడు తాను కోరికలను వీడి
యట్టివారికిపుడు నంజలిడుతు



–డా.సముద్రాల శ్రీదేవి
9949837743

పది పరీక్షలు

అధికారుల ఆర్భాటం
ఉపాధ్యాయుల ఉబలాటం
పోరగాండ్ల పోరాటం
డిసెంబర్ లోనే... కాదు కాదు
ఈసారి అక్టోబర్లోనే షురువైంది
పైసల వేట ప్రైవేట్ లో
సుమారు సంవత్సరముందుగానే.

స్పెషల్ క్లాసులు
ప్రింటెడ్ నోట్స్ లు
ఊకునుడు లేదు
ఊకొట్టుడు లేదు
ఒకటే... ఊరుకుడు
పరిగెత్తి పరిగెత్తి పరీక్షల కాడికి వస్తిమి

పరీక్షల మీద పరీక్షలు
సమీక్షల మీద సమీక్షలు.

చివరాఖరికి పరీక్షల నాడు
ఉదయం ఒకటే ఆతృత
సెంటరెట్లుంటది పేపరెట్లొస్తది
పరీక్షలు రాసిన పోరలు
పాఠాలు చెప్పిన పంతులు దగ్గరికొచ్చి
మీరు చెప్పినవి అన్నా
సంతోషముండు
మేము చదివినవి అన్నా
సంబరముండు
గుండెల్లో గునపం దింపినంత మాట
చీట్లు మస్తు నడుస్తున్నవన్నప్పుడు
ఈ మార్కుల వేటలో
చదువు చెప్పినోడు స్తబ్దుగా ...!

–డా. ఎడ్ల కల్లేశ్
9866765126

వనజ శతకము

నమ్మకమ్ము నిలుచు నయమెల్ల వేళలన్
నటన జేయరాదు నరులముందు
ఆత్మనిందు కుండ యపనమ్మ కమదేల
వనజ మాట మిగుల వాస్తవమ్ము!!

చిన్ననవ్వు తోడ చిగురించు స్నేహమ్ము
ధనము సాటి రాదు ధర్మమునకు
మనసులోని మమత మనబంధమును బెంచు
వనజ మాట మిగుల వాస్తవమ్ము!!

–యం.వి.ఉమాదేవి
7842368534

పుస్తక సమీక్ష

రామనాథుడు రచన

ప్రజ్ఞానం బ్రహ్మ

శ్రీయుతులు వి.వి. రామనాథం గారు రచించిన "ప్రజ్ఞానం బ్రహ్మ" అన్న గ్రంథం ఆధ్యాత్మికతకు చెందిన వివిధ అంశాలను మనకు పరిచయం చేస్తుంది.

"ఇది మీకు తెలుసా"అంటూ ఏడు అధ్యాయాలతో అనేక విషయాలను తెలియజేసిన మంచి పుస్తకమిది.

మొదటి అధ్యాయంలో దేవుని ముందు కొబ్బరికాయ కొట్టడంలోగల అర్థం చెబుతూ సత్వ ,తమో రజోగుణాల వివరణ, దేవునికినైవేద్యంగా అరటిపండు సమర్పించడం లోని పరమార్థాన్ని తెలుపుతూ అరటిచెట్టుకు సంవత్సరంలో గెల ఒకసారే వస్తుంది. అలాగే ఎనభై నాలుగు లక్షల జీవ రాశులలో మానవ జన్మ ఒకేసారి వస్తుందని, అరటి పండును ఆదర్శంగా తీసుకొని నిన్ను నీవూ భగవంతునికి సమర్పించుకొమ్మంటు, నమస్కారం యొక్క అర్థాన్ని తెలియచేస్తు ,జీవన్ముక్తి, దీక్ష,దీపారాధన చేయుటలో గల విశిష్టతను ఇంకా అనేక విషయాలను ఈ అధ్యాయంలో తెలిపారు.

రెండో అధ్యాయంలో గురుశుష్యుల సంబంధాలను తెలుపుతూ , గురువుఅందించే జ్ఞాన ఫలాన్ని శిష్యుడు ప్రసాదంగా స్వీకరించి, ప్రపంచానికి వితరణ చేసేవాడే శుష్యుడన్నారు. మానవుడు మూడురకాల దుఃఖాన్ని అనుభవిస్తాడని, జనన- మరణాల గురించి తెలుపుతూ మనిషికి, సమస్త ప్రాణికోటికి చివరి గమ్యం 'ఆత్మ' దర్శనమేనని కవితలతో ఆధ్యాత్మిక జ్ఞానమందించారు.

మూడవ అధ్యాయంలో స్త్రీ, పురుష బంధాలను, అనుబంధాలను ,మాంగల్య ధారణలో మూడు ముళ్ళు వేయడానికి గల కారణాలు, వధూవరులకు కట్టే బాసికం నుండి అరుంధతి నక్షత్రం చూపడానికి గల కారణాలు



వివరించారు .

అధ్యాయం నాలుగులో శరీర స్వరూపాన్ని ఇంద్రియాలు – వాటి అధిదేవతలను, సృష్టివిశిష్టత అధి దేవతలను గురించి, అరిషడ్వార్గాల వలన కలిగే వినాశనాన్ని తెలుపుతూ వాటిని ఎలా నిగ్రహించుకోవాలో తెలుపుతూ మనసు, ఆత్మల సంఘర్షణలను , తత్వాన్ని చదివి తీర వలసిందే.

అధ్యాయం ఐదులో దేవాల యాన్ని వాటి ప్రాశస్త్యాలు హరిహరుల తత్వాన్ని,సత్ సాంగత్యాన్ని, గీతా సారాంశాన్ని వివరిస్తూ రాగద్వేషాలకు అతీతులై నిర్మల హృదయంతో ఉ ండాలంటారు. సుఖం, సంతోషం, ఆనందాలను వివరిస్తూ జనన మర ణాల మధ్య జరిగే చిత్ర విచిత్ర సంఘ టనలతో జీవుని లక్ష్యాన్ని తెలిపారు.

అధ్యాయం ఆరులో సత్యాన్ని గురించి చెబుతూ సత్యం మూడు రకాలని వివరిస్తూ , నత్యం బ్రహ్మస్వరూప లక్ష్యమన్నారు. లలితా సహస్రనామ గొప్పతనాన్ని , షోడశి, పంచదశాక్షరి యంత్రాలను గురించి తెలుపుతూ ,

"నేనెవరిని "అని శ్రీరామునికి ఉ దయించిన సందేహాల

జనాభాకు అనుగుణంగా ఎంపీల సంఖ్య పెంచాలి

-బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ బీఎస్.రాములు

దేశ జనాభాకు అనుగుణంగా ఎంపీల సంఖ్య పెరగాల్సిన అవసరముందని బీసీ కమీషన్ మాజీ ఛైర్మన్ బీస్ రాములు అన్నారు. అప్పుడే బీసీలకు చట్టసభల్లో సరైన ప్రాధాన్యం లభిస్తుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడర్ 132వ జయంతి వేడుకలను అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డా॥ బీఆర్ అంబేద్కర్-ఒబీసీ కమ్యూనిటీలు' అంశంపై బీఎస్ రాములు స్మారకోపన్యాసం చేశారు. నాటి రాజ్యాంగ సభలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఓబీసీల పోరాటంలో ఒంటరిగా పోరాడారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా అంబేద్కర్ కోరుకున్న సమానత్వం పూర్తిగా రాలేదన్నారు. సమానత్వం, వివక్షత లేని ఆర్థిక సమానత్వ సమాజం కోసం ఓబీసీలలోని మేధావి వర్గం ప్రయత్నం చేయాలన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. సీతారామారావు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి ప్రారంభించడం ఆయనకు నిజమైన నివాళిగా పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో విశ్వవిద్యాలయం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధిపతి డా॥రజని, రిజిస్ట్రార్ డా.ఎ.వి.ఎన్.రెడ్డి, విశ్వ విద్యాలయ పాలక మండలి సభ్యులు డా. బానోత్ లాల్, ఈఎంఆర్అండ్ ఆర్సీ డైరెక్టర్ ప్రొ.వడ్లాణం శ్రీనివాస్, డీన్ ప్రొ.పుష్పా చక్రపాణి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మహేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని వారం రోజులుగా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు.

చిన్న కథకు నమూనాగా పదమూడు నిక్కమైన నీలాలు



కృష్ణమూర్తి వంజారి 'ఓ చిన్న కథల పుస్తకం" ఈ 'నాలుగడుగులు'. నటుడిగా శతాధిక పాత్రల్ని పోషించి, మెప్పించి ప్రేక్షకులను అలరించిన కళాకారుడు ఈ రచయిత వ్యక్తిత్వంలోని సౌమ్యత, స్తిమితత్వం, మంచిని పాటించి, పెంచి, పండించాలనే వాంఛితం, ఇవన్నీ ఈ కథల్లో ప్రతిఫలిస్తున్నాయి. పుస్తకంలోని 13 కథలూ నిజంగానే చిన్న కథలు. కథలు రాయడం కంటే చిన్న కథ రాయడం అసిధారావ్రతం. దానికి ఎంతో తపన, తపస్సు కావాలి. ఈ రెండు కృష్ణమూర్తి గారికి ఉన్నాయని రుజువు చేస్తున్నాయి ఈ కథలు.

మొదటి కథ "మనిషెక్కడో లేడు". ఎన్నడో ఎవరికో చేసిన సాయానికి ప్రతిఫలం కష్టదశలో ఆయాచితంగా లభిస్తే, ఆ కృతజ్ఞతా భావం అనిర్వచనీయమే అవుతుంది. అందునా, ఆ ప్రతిఫలం తాను సాయం చేసిన మనిషి నుండి కాక అతని కుమారుని ద్వారా అందటం మరీ అపురూపమవుతుంది. అక్కడ ఉన్నాడన్న మాట "మనిషి"!

"ఆ బాధ్యత నాది కాదా" తాను చేస్తున్న హోటల్ బిజినెస్ లో సహకరిస్తూ, తన కుటుంబంలో ఒకడై మసలుతున్న ఆత్మీయుడు రాఘవయ్య అకస్మాత్తుగా రాత్రికి రాత్రి మరణిస్తే, అతని అంతిమ సంస్కారం తన 'బాధ్యత ' గా భావించి చేయిస్తాడు మూర్తి. తన తండ్రి ఆబ్దికం రోజునే అయినా కర్తవ్యస్పృహకి విధేయుడై నిలిచాడు కథానాయకుడు మూర్తి.

"నా నమ్మకం " కథలో మనిషిలో మంచితనాన్ని పెంచటమే తరం నుండి తరానికి వారసత్వంగా అందాలనే జీవిత పరమార్థాన్ని సందేశిస్తుంది.

"గౌను" కథ ఉత్కంఠభరితంగా సాగింది. కూతురి కోరిక తీర్చడానికి తాపత్రయపడుతూ, వృద్ధ చెందుతున్నాడు ఓ తండ్రి. ఆ పిల్ల తల్లి ఆమె చనిపోవడానికి ముందే ఈ గౌనుని సిద్ధం చేసి పెట్టెలో దాచి పెట్టి చనిపోయింది. కన్నవారి ప్రేమకూ, మమకారానికి జయోస్తు !

"నేనేం చేసుకోను" కథలో గర్భగుడిలో అమ్మవారి ఎదుట నిత్యం పూజ చేసే పూజారికి, తాను బిచ్చగత్తె అయినా, ప్రతి రోజు తాను యాచన ద్వారా గడించిన డబ్బు తన తిండి అవసరానికి పోను మిలిగిన డబ్బుని అమ్మవారి హుండీలో వేసి, తన దాతృత్వ గుణంతో పూజారికి జ్ఞానోదయం కలిగించింది ఆమె "నేనేం చేసుకోను" కథలో. యాచకురాలిలోని ఉదాత్త గుణాన్ని చూపడం ద్వారా తాను పూజారి కంటే గొప్ప భాగ్యవంతురాలుగా కొనియాడదగిన పాత్ర ఆమెది.

ఈ తీరుగానే మిగిలిన కథల్లో ఆదర్శవంతమైన నడత గల పాత్రలు, చదువరిని ముగ్ధులను చేస్తాయి. మానవీయ విలువల పరిరక్షణకు, ఈనాటి సామాజికావసరంగా, సాహిత్యావశ్యకతగా గుర్తించి కథారచనకు పూనుకున్న కృష్ణమూర్తి గారి నుండి మరిన్ని మంచి కథల్ని ఆశిద్దాం.

-విహారి
సెల్:9848025600

ఈ రాజకీయ వ్యవస్థ ఎన్నాళ్లు కొనసాగాలి?

పూర్వం ప్రపంచ దేశాల్లో రాజుల పరిపాలన కొనసాగింది. కొందరు ప్రజల కొరకు సుపరిపాలన అందించి చరిత్రలో మంచివారుగా కీర్తికెక్కారు. మరికొందరు దుష్ట పరిపాలన అందించి చరిత్ర హీనులుగా మిగిలిపోయారు.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ప్రపంచ దేశాలన్నీ ఒక వేదిక పైకి వచ్చి, యుద్ధాలతో మనల్ని మనం చంపుకొని ప్రజలను కూడా చంపడం భావ్యం కాదు? మనమే రాజులమని ప్రకటించుకొని వారిపై పరిపాలన సాగించడం కూడా ధర్మం కాదు? కాబట్టి, ప్రజల చేత ఎవరైతే ఎన్ను కొనబడి విజయం సాధిస్తారో, వారే దేశాన్ని పరిపాలించాలి. అది కూడా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నిక జరగాలి.

ఆ పిదప, తిరిగి మళ్ళీ ఎన్నిక జరగాలి. అప్పుడు గెలుసిన వారు కొనసాగ బడాలి. అని తీర్మానం చేసుకున్నారు.

ఎన్నికల పద్ధతిలో మూడు రకాల ఎన్నికల విధానాన్ని రూపొందించుకున్నారు.

ఒకటి ప్రెసిడెంట్ పరిపాలన విధానం, రెండు సామ్యవాద పరిపాలన విధానం, మూడు ప్రజాస్వామ్య పరిపాలన విధానం.

భారతదేశం ప్రజాస్వామ్య విధానాన్ని ఎన్నుకొని, దానికి సంబంధించిన రాజ్యాంగం రూపొందించుకొని, పరిపాలన సాగిస్తుంది.

అలా మనకు స్వాతంత్రం సిద్ధించాక, మన దేశ పరిపాలన 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. కానీ, నేడు ఎంతో సాంకేతిక అభివృద్ధి సాధించినా? మన దేశ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నా చందాన ఉంది.

నేటికీ ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టడానికి బట్టలు లేక, అలమటించే అబాగ్యులు ఎందరో ఈ దేశంలో ఉన్నారు. అడ్డదారుల్లో వెళ్లేవారు కోట్లకు పడగలెత్తారు. మరెందుకు ఈ పరిపాలన విధానం? మరెందుకు ఈ రాజకీయ వ్యవస్థ దేశాన్ని సరిదిద్ద లేకపోయింది? అంటే, రాజకీయ విలువలు

ఎప్పుడో పాత రేయబడ్డాయి! ఇప్పుడు ఎవరి చేతిలో డబ్బు ఉంటే, వారే పార్టీ పెట్టవచ్చు. సుక్క, ముక్క, డబ్బు వెదజల్లి ఓట్లు కొని, గద్దెనెక్కవచ్చు. లేదా? వేరే పార్టీకి డబ్బులు ఇచ్చి టికెట్ కొని గెలవచ్చు. ఇక అతను ఖర్చుపెట్టిన డబ్బు ఏదో ఒక మంత్రి పదవి చేపట్టి సంపాదించవచ్చు. ఖజానాలో సొమ్ము తన జేబులో నింపుకోవచ్చు. డబ్బే కాదు? ఎన్నో హత్యలు, మానభంగాలు చేసిన వాళ్ళు కూడా ఎన్నికల్లో గెలిచి ప్రజలను పాలించవచ్చు. ఇది నేడు సాగుతున్న రాజకీయ చరిత్ర!

ఒకప్పుడు హత్యలు, మానభంగాలు అంటేనే భయపడిపోయేవారు. నేడు ఎన్ని హత్యలు, మానభంగాలు చేస్తే,వాడే మొనగాడు. నాయకుడు.

సమాజం కూడా అలాంటి వాళ్లకే తలవొగ్గి నిలబడిపోతుంది. ఇప్పుడు ఒక పార్టీ పేరు గుర్తు మీద గెలిచిన వాళ్ళు ఏకంగా ప్రభుత్వానికి అమ్ముడుపోయి, అదే పార్టీని వారి పార్టీలో విలీనంచేస్తున్నారు. ఇది ఏ దేశ చరిత్ర? సమాజం గుర్తించలేక పోతుంది? ఇది తప్పు అని నిలదీయలేక పోతుంది? కారణం? మనకెందుకు ఈ గొడవ? ఎవడు ఎక్కడ పోతే, మనకేంటి? ఎవడు ఎంత దోచుకుంటే, మనకెందుకు? ఎన్నికల్లో చుక్క, ముక్క, డబ్బు దొరికితే చాలు. పథకాల నూకలు జేబు నిండితే చాలు. అనుకుంటున్నారు తప్ప ఎదిరించే వారే లేరు? నిగ్గదీసి అడిగే వారే లేరు. కారణం? డబ్బు... డబ్బు! అదే ధ్యాస! అదే అక్రమార్జన. మరి దేశంలో ఎన్నో పార్టీలు ఉన్నాయి. అవి ఏం చేస్తున్నాయి? ప్రతిపక్షాలు ఏం చేస్తున్నాయి? అంటే, అన్ని పార్టీల దారి ఒక్కటే! కాసేపు ప్రజల కళ్ళు కప్పడానికి, ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకోవడం. ముఖాల మీద ఉమ్మి వేసుకోవడం. అలాయి, బలాయి తీసుకోవడం. మామూలే! పాపం మీడియా ఏం చేస్తుంది? గొంతెత్త లేక తన అవసరాలు తను చూసుకుంటుంది. ఇలా ఈ వ్యవస్థ ఎన్నాళ్లు కొనసాగుతుందో? కాలానికే తెలియాలి?

-ఆకుల రాఘవ,
సెల్:9440971792

కవితా తరంగాలను సృశించిన జాషువా

గుర్రం జాషువా కవి కవిత్వంలో నిత్య సత్యాలు మనకు అగుపడతాయి వాటిని తధర్మకాలు అని అంటాం. "కవిని కన్నతల్లి గర్భంబు ధన్యంబు కృతిని జెందువాడు మృతుడు కాడు" ఎలా అవుతాడు కాలేదు కవికి మరణం లేదు కాబట్టి చిరంజీవి జాషువా కూడా అంతే తన మనసు పొరల్లో నిక్షిప్తమై ఉన్న దయ, సానుభూతి, కరుణ, జాతీయత అభిమానం, ఆధ్యాత్మికత ప్రకృతి ఆరాధన తెలుగు భాష పై మమకారాలను జాషువా తన రచనల్లో ప్రతిబింబింప జేశాడు, తను ఏ కావ్య రచన చేస్తున్నప్పటికీ కవికి ఉండవలసిన సుగుణాలను కవిత లక్షణాలను సూచించి పద్యాలకు కొత్త శోభను కలిగించే ప్రయత్నం చేశాడు.

" కవులకిది పరీక్షా యుగం విశ్వధర్మం విశ్వ మతం ధీరవాక్కు నేడవసరం ఈ ధర్మం మతం దీనవాక్కు" ఇవన్నీ కవులకు ఎప్పుడూ అవసరం రాలేదు. శాసన కాలంలోన, వీర శైవుల కాలంలోన, ప్రబంధ కాలంలోన, ఆధునిక కాలంలోన, అత్యధిక అత్యాధునిక కాలంలోన కవులకు ఎప్పుడు అవసరమే ఎప్పుడు కవులకు పరీక్షా కాలమే, ఇప్పుడు జాషువా కాలం కూడా అంతే. ఏ మానవ జీవితం అయినా సమకాలిన సామాజిక జనజీవన స్థితుల పరిస్థితులకు ప్రభావితం అవ్వకుండా ఉండదు. ఈ ప్రభావ దారలో మునిగి పరిపూర్ణులై మానవతావాదులై మారి మహాకవులుగా ఉద్భవిస్తారు. అలా ఉద్భవించిన వారిలో జాషువా ఒకరు. జాషువా కవిగా మారడానికి కుటుంబ నేపథ్యం కూడా ఒక విధంగా దోహదపడింది. ఒక కొంగు చాటు బిడ్డగా తల్లి నుండి ప్రేమామృతాన్ని పొందాడు . తండ్రి సంరక్షణలో నిజాయితీని పొందాడు. అలాగే కరిగిపోయే మనస్తత్వాన్ని తల్లి నుంచి ప్రతిఘటించే తత్వాన్ని తండ్రి నుంచి జాషువా అందిపుచ్చుకున్నాడు. జాషువా చిన్నప్పటినుండి వేదనాభరితమైన జీవితాన్ని అనుభవించాడు ఆ అనుభవంతో తన అంతరంగంలో సామాజిక అంశాల పట్ల కలిగినటువంటి సజీవ స్పందనలు, ఘర్షణ సంఘర్షణలకులోనై కవితారంగాలుగా వెలువరించాడు. అప్పుడే ఈ సభ్య సమాజాన్ని సమ సమాజంగా మార్చాలని ప్రతిన బూనాడు, సతీమణితో కలిసివున్న రోజుల్లో ఎనలేని ధైర్య సాహసాలను రచనల్లో ప్రదర్శించాడు.

రాజు కన్నా కవి గొప్ప వాడని అంతేకాకుండా "నేను స్వతంత్ర జీవినయి నిల్చితి" అందుకే "కటిక చీకటివాపెద" ఎందుకంటే "రాజు మరణించే నొక తార రాలిపోయే, కవియు మరణించే నొక తార గగణమెక్కె, రాజు జీవించె రాతి విగ్రహము లందు, సుకవి జీవించె ప్రజల నాలుకల యందు" అని అసలు వాటి పుట్టుక వెనుక రహస్యం ఏమిటో ఓ కవి మాటల్లో ఇప్పుడు చూద్దాం "మానవునికి మంచి నేర్ప మతం పుట్టెను కానీ కాలగతిన గొప్ప చిక్కు తెచ్చి పెట్టెను మనిషిగా బ్రతికించలేని మతం ఎందుకు మానవతే మతంగా సాగు ముందుకు పనులు సాగిపోనీలలో కులం పుట్టెను కానీ కుళ్ళు నెంతో హృదయాలలో కూర్చి పెట్టెను సచ్చిలతే సత్కులం సమతే జాతికి బలం గుణమును గణించినప్పుడే పొందుతాము. సఫలం అన్య జీవులందులేవు కులము మతములు లేవు ధన్యజీవి మనిషికి అవి సొగసులు కావు" అవును ఎలాగవు తాయండి కావు. కానీ కులమతాలు ఈ సమాజంలో ఉన్నంతవరకు మనుషుల మధ్య అంతరాలు నశించిపోలేవు. వికృతమైన ఆకృత్యాలు నేర్చుకున్న మనిషి వాటికీ అతీతంగా ఉండలేకపోతున్నాడు. కులాన్ని మతాన్ని కూకటి వేళ్లతో కూల్చేయాలంటే మనలో మానసికమైన మార్పు, సామాజికమైన మార్పు, వ్యక్తి కుటుంబ మార్పు మానవ జాతిలో రావాలి. అది రావాలంటే మనిషికి జ్ఞానం అవసరం. ఆ జ్ఞానాన్ని కావ్యం ద్వారా కవి ప్రసాదిస్తాడు. ఇక్కడ జాషువా చేసింది కూడా అదే, గబ్బిలం ఫిరదౌసి మొదలైన కావ్యాల్లో జాషువా ఇచ్చిన సందేశం అలాగే గురజాడ వారి కన్యాశుల్కం కానీ నన్నయ తిక్కన ఆంధ్ర మహాభారతం ఇచ్చిన సందేశాలన్నీ జ్ఞానాత్మకమైనవే. అవి కులాల్లో మతాన్నీ జాతిను సంస్కరించే విధంగా అంతర్లీనంగా జ్ఞానాన్ని ఇస్తే ఆ జ్ఞానం ఈనాటికి ఇంకా మన వరకు చేరనే లేదు అవును నిజం ఇంకా చేరనేలేదు, ఇంకా ఎప్పటికీ చేరదు. ఎలా చేరుతుంది జాషువా కాలంలో చూసినట్లయితే తన రచనల ద్వారా సమాజ చైతన్యాన్ని కలిగించాడు కానీ సత్య ధర్మ ప్రవక్తలైన కవుల అనేకులు ప్రణయ వ్యాధిగ్రస్తులై ఉన్నారు. వారి కవిత్వం దొడ్డ రాళ్ళ గుండ్లు దొరలించి పటితుల బెదురు బిడ్డ బెట్ట కవిత విస్తరించి పండితులకు దక్క పరులకందకపోయే దేవతలకు కామధేనువట్లు వ్యర్థంగా పడి ఉంది అవును సమాజాన్ని నిద్ర లేపుటకు ఉపయోగపడలేదు ఇంకా ఇంకా ఇంకా వక్ర చరిత్ర అయిన వ్యక్తులు గల చోట స్తబ్దత చెంది కవితా వాహిని చిలి పాయలై ఆగంబై స్వేచ్ఛగా పరుగులెత్తింది. విషపు నవ్వుల లహరి వేషగాండ్రా లనుగుడి గుడి విశ్వవ్యాప్తంగా జ్ఞానాంధకారాల్ని ఇచ్చింది. ఇచ్చోటనే సత్యవీంద్రుని కమ్మని కలము నిప్పులో కరిగిపోయే, కావున విశ్వ నరుడను నేను పుట్టంగా వలె నబ్బవీశ్వరుడు అని ఎవరైనా ఆవేదన చెందుతారు. అవును ఇక్కడ జాషువా కూడా అంతే కవి పలుకులు వేదవాక్యంబులనియు సుఖవి జీవించే ప్రజల నాలుకల యందు అని ఆనాటి మాటలు నిత్య సత్యములే ఈ విధంగా తన కవిత తరంగాలను సృజించిన కవితా విశారధుడు జాషువా, తెలుగు సాహిత్య చరిత్ర ఉన్నంత వరకు తెలుగు ప్రజల హృదయాలలో జ్ఞాన జ్యోతిలా జీవిస్తూనే ఉంటాడు జీవిస్తూనే ఉంటాడు.

తాను ఎంచుకున్న కవిత వస్తువులు తన హృదయానికి తగినట్లు ఆవిష్కరించుకొని తధానుగుణంగా మలుచుకొని కవిత్వం చెప్పడం జాషువా ప్రత్యేకత.

-డాక్టర్ ఎల్మల రంజిత్ కుమార్ , తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ స్నాతక కళాశాల, నిర్మల్ . 9849808757

నైజం

తెగిన గాలిపటమయ్యాక
చిరిగిపోయినా.. చిక్కుకు పోయినా
అస్తిత్వం కోల్పోక తప్పదు-

గుప్పిట్లోకి దూరిపొయ్యాక
నలిపేసినా.. గోడకు విసిరేసినా..
మూల్గుల ముచ్చట్లు తప్పవు-

బతుకుని కర్ఫీఫ్ మడతల్లా చుట్టి
ఏ జేబులోనో కుక్కినాక ..
మూతులేవైనా తుడవక తప్పదు-

చట్రంలోకి చొచ్చుకు పొయ్యాక
ఒరుసుకుపోయినా..
కరుసుకు పోయినా..
తిరుగాడక తప్పదు-

కమ్మిన మాయ పొరలెప్పుడు
భ్రమల్లోకి దించేవే...
బలహీన క్షణాలన్నీ
బలి పీఠం ఎక్కించేవే....
భయం భయంగా.. గాలివాటంగా..
ఎంత కాలం ?

కప్పుకున్న చీకటికి
కాసింత చిద్రమేసినా..
వెలుతురు తీగ
నీకో చూపునిస్తుంది...!
కొత్త రూపునిస్తుంది...!
నువ్వు నువ్వుగా నిలబడటమే
అసలైన నైజం...!!

-మోతుకూరి అశోక్ కుమార్,
9247380976

జలము లేకుంటే జగతి లేదు

నరుడి అహంకారం అందలమెక్కి
అవనిపై విషపు జల్లులు చిమ్ముతున్నాడు
పంచ భూతాలను పుక్కిట పట్టి
సకల ప్రాణులకు
కీడు వలను విసురుతున్నాడు
అవని ఆభరణాలను బుగ్గి పాల్జేసి
మనిషి విలాస ఊయలలో ఊరేగుతూ
భావి తరాల నోట్లో మట్టి గొడుతున్నాడు .

అవని పై తరువులను తరుగుతూ
భవితకు ఎడారి దుప్పటి కప్పుతున్నాడు
ధరణి గుండె లో గునపాలను దింపుతూ
పుడమి పొత్తిల్ల లోని నీటి చుక్కలను
ఒడుపుతో ఒడిసి పడుతున్నాడు
నీటిపై కాసుల సామ్రాజ్యాన్ని నిర్మించి
స్వార్థ గుట్టలను పేరుస్తున్నాడు.

పుడమి అడుగడుగునా పొగ గొట్టాలను
నాటుతూ వ్యర్థాలను జలాలలోకి జారవిడిచి
జల సిరులను
మురికి కూపాలుగా
మారుస్తున్నాడు
గుక్కెడు నీటి కోసం
గుబులును రాజేసి
జనం తిప్పలకు తెర లేపుతున్నాడు.

కూడుతిన్నా ,
కుతిక పడ్డా గరిటెడు నీళ్లే గతి
కడుపులో గుడగుడ అన్నా ,కాడు కాడ
కుండ పట్టాలన్నా నీళ్లే శరణాగతి
నీరు లేకుంటే నరుడి గమనం లేదు
నీటి దారలు లేకుంటే జగతి అధోగతి
జలప్రసాదము లేకుంటే జగతి లేదు
నీటి సంరక్షణ లేకుంటే పురోగతి లేదు

-తాటిపాముల రమేష్,
7981566031

భారతమ్మ

పంచమవేదమై పరుధవిల్లుచునున్న
భారతమును రాసే వ్యాసమునియు
పద్దెందిపర్వాల పర్వత మెక్కియు
ఆది కావ్యముగను నవతరించె
సంస్కృతమందున సంస్కారవంతంగ
పురుడోసుకున్నదీ పుణ్యచరిత
కావ్యమ్ము నంతయు కలిసి కవిత్రయుల్
అనువదించె తెలుగులందముగను.
నన్నయాధి సభలు నడయాడె నట్టింట
తిక్కన కృతులన్ని తిరిగెభువిన
ఎఱ్ఱన హరివంశ మెంతో
ఘనత పొంది
భారతమ్మ యెంత
భాగ్యమాయె!

-నవీన్ గొర్రెక,
9618039501

చిరస్మరణీయుడు

కవికి
ఆ కవి దారిద్ర్యం అవమానం
అసమానత అస్పృశ్యత
అన్యాయం అధర్మం అన్నీ తెలుసు
కులమతాల కుళ్ళుతో
తన సంతతి జాతి ఎలా
అణగద్రొక్క బడుతుందో తెలుసు
తిండికి బట్టకు నోచుకొనక
అజ్ఞానాన్ని నెత్తిన మోస్తూ
అవర్ణులై అవిద్యులై నిరుద్యోగులై
చిర దాస్యానను భవిస్తూ
బలి పశువుల్లా
ఉనికిని కోల్పోయి ఎలా
వాళ్ళు బ్రతుకుతున్నారో తెలుసు
అందుకే అతను
సంఘ సంస్కర్త
జాత్యోద్ధారకుడయ్యాడు
మహా మేధావి రాజ్యాంగలర్మాత
దేశ మెరిగిన మహనీయుడు
మహామేరు శిఖరమతడు
ధీరోదాత్త చరితుడు
మానవజాతికి చిరస్మరణీయుడు
భరత జాతి ముద్దు బిడ్డ
అంబేత్కరు సూర్యుడు.

-భూషి కృష్ణదాసు
సెల్:9618069338

మాతృమూర్తి...

అమ్మయాలిచెల్లి యన్ని
నీవేయయ్యి
ఆత్మబంచిబిడ్డ కాయువిచ్చి
పురిటినొప్పిబాధ పుట్టేటి బిడ్డకై
నోర్చుకుంటివమ్మ యోర్పుతోడ!

శివునియాజ్ఞలేని చీమైనకుట్టున
మగువలేనిజన్మ మనిషికుంద
ఆయువోసెవాని కాయువుపోసిన
మాతృమూర్తివమ్మ మగువనీవు

నరకయాతనబడి
నవమాసములు మోసి
నాకుజన్మనిచ్చి నన్నుసాకి
పుడమిలోన
నన్ను పుణ్యాత్మునిగజూపె
పుణ్యమూర్తినీకు పూజజేతు.

-నవీన్ గొర్రెంక
96180 39501

జీవితం ఎడతెగని పోరాటం

జీవితం ప్రశ్నార్థకం జీవితం అప్పుడప్పుడు తెల్ల కాగితం
జీవితం విరిసే మల్లెతీగ జీవితం రాఖీ రాని సుగంధ ధూపం
జీవితం ఒక విశ్రాంతి మందిరం జీవితం స్వేచ్ఛ విహారం
జీవితం నిత్యం సంఘర్షణ పోరాటం
జీవితం నిరంతరం సాధనం
జీవితము ఒక ధ్యాన సముద్రం జీవితము ఒక జ్ఞాననేత్రం
జీవితం జయ అపజయాల మధ్య ఓగిసలాడే డోలకలోలకం
జీవితం ఒక దిశా నిర్దేశం జీవితము ఒక అంతులేని అరణ్యం
జీవితం నిత్య ఆలోచన సముద్రం పరిశోధనాగారం
జీవితానికి ఒక ఆధారం ఉండాలి జీవితంలోనూ
ఆవేశం ఉంటుంది జీవితంలోనూ
ఒక ఆనందం ఉంటుంది జీవితంలోనూ
విషాద సముద్రం దాగి ఉంటుంది
జీవితమంటే ఏమనుకున్నారు జీవితం ఎప్పుడూ
అగాధాలతో కూడిన అగర్తలతో కూడిన
వలయ వలయాలతో కూడిన అడ్డుగోడలే
జీవితము ఒక మైదానం
జీవితము ఒక పెను తుపాను జీవితం ఒక తీయని
అలల కెరటాల పడిలేచే సంగీతం
జీవితమంటే అర్థం సుదీర్ఘం జీవితమంటే
భావం వినూత్నం విలక్షణం విశేషం విఖ్యాతం ప్రఖ్యాతం
జీవితమంటే కీర్తి కాంతి జీవితమంటే మరపురాని ఘట్టాల
మధురమైన జీవన గాధ జీవితం అంటే ఎన్నో
జ్ఞాపకాల పేటిక జీవితం మర్చిపోలేని దుఃఖ సముద్రం కూడా...
జీవితానికి సమగ్ర నిర్వచనం లేదు
జీవితం ఎంత చెప్పినా తరగని గని

-డాక్టర్ సి హెచ్ ఆంజనేయులు,
7702537453

నవ శకం

అందరూ నడిచిన పాత దారిలో
నడిచావంటే..
అందరిలో ఒక్కడివైపోతావు
నీవైపు అందరూ చూసేలా
క్రొత్త దారిలో నడిచావంటే..
అదే నవ శకానికి నాంది..

పాలన గతి తప్పితే
ప్రజలంతా బాధలు పడితే
ఆ బాధల నుంచి విముక్తి కలిగిస్తే
ఆ పాలన ప్రపంచమంతా మెచ్చితే
ప్రజలు జేజేలు పలికితే
అది నవ శకానికి నాంది

- బూర దేవానందం
8143589789

కమ్మనైన అమ్మనుడి

తల్లి సున్నము పిన్నిట బెల్ల మాయె
ఆంగ్ల భాష మాట్లాడిన హాయి గలుగు
మనల తెలుగు మాటాడగ మనసు రాదు
యేమి ఖర్మమో తెలు గన్న లేమి చూపు.

సంస్కృతంబు లోని మధుర సారమంది
అరవ భాష నుండి నుదుల సందమొంది
కన్నడంపు కస్తూరికా వన్నెలంది
పర నుదుల మాటలను కూడి పరవశించు
కమ్మనైన తెలుగు మన అమ్మ నుడిర

భాషయనిన తమిళులకు ప్రాణ మాయె
మహిమరాటీల భాషపై మమత జూడు
కన్నడిగులకు భాషయే కల్పవల్లి
ఉత్తరాదులకిందీయె యూపిరాయె
వారి జూసైన మనవారు మార రేమి!?

తేటగీతి.
మాతృభాష తెలుగు గూర్చి మౌనమేల
తెలుగు వారికే ల నుడిపై తెగులు బుట్టె
మనకు ప్రభుత కు తెలుగుపై మనసు లేదు
జాను తెలుగందు తెలుగోడి జాడ యేది.

మమ్మియని పిలువ మురిసేనమ్మ నేడు
తండ్రిని ట డాడి యనగానె దర్ప మాయె
అత్త పిన్నియో తెలియదు ఆంటి యనిన
అచ్చ తెలుగు మాటాడిన నచ్చదాయె.

-రాఘవ మాస్టారు
9741407099

ఇద్దరు స్నేహితులు

(కథ)

ఇద్దరు ప్రాణస్నేహితులు ఒకరోజు ఎడారిలో నడుచుకుంటూ వెళుతున్నారు. వారు వెళ్లే క్రమంలో ఇద్దరి మధ్య వాదన జరిగి ఒక స్నేహితుడు, ఇంకో స్నేహితుణ్ణి చెంపపై కొట్టాడు.

కానీ చెంప దెబ్బ తిన్న స్నేహితుడు మారుమాట్లాడకుండా ఇసుక పై ఇలా రాశాడు. "ఈ రోజు నా ప్రాణ స్నేహితుడు నన్ను చెంపదెబ్బ కొట్టాడు".వారు అలానే నడుచుకుంటూ వెళ్లగా, చివరకి ఒక ఒయాసిస్ దగ్గర ఆగారు. అక్కడ స్నానం చేయాలని అనుకున్నారు. ఇంతకుముందు చెంపదెబ్బ తిన్న వ్యక్తి ఆ ఒయాసిస్ లో మునిగిపోసాగాడు. కానీ ఇంకో స్నేహితుడు అతనిని కాపాడాడు.

బయటకు వచ్చిన ఆ స్నేహితుడు ఒక రాయిపై ఇలా చెక్కాడు? "ఈ రోజు నా స్నేహితుడు నా ప్రాణాలు కాపాడాడు".చెంపపై కొట్టిన, ప్రాణాలు కాపాడిన స్నేహితుడు అతనిని ఇలా అడిగాడు... "నేను నిన్ను కొట్టినపుడు ఇసుకపై రాశావు, ఇప్పుడేమో రాయిపై రాశావు. ఎందుకు?"అని.అప్పుడు ఇంకో స్నేహితుడు ఇలా అన్నాడు. "మనల్ని ఎవరైనా బాధపెడితే ఇసుకపై రాసుకోవాలి, క్షమా గుణము అనే గాలి దాన్ని చెరిపి వేస్తుంది. కానీ మనకు ఎవరైనా మంచి చేస్తే, దానిని రాయిపై చెక్కితే ఎవరూ కూడా చెరిపి వేయలేరు."కథలోని నీతి:

మనల్ని ఎవరైనా బాధ పెడితే క్షమించాలి. మనకు ఎవరైనా మంచి చేస్తే మనసులో నిలుపుకోవాలి.

-వి.శేషారావు
9440408080

జాతీయ కవిగా డా॥ వడ్డేపల్లి కృష్ణ-ఉద్గీత కవితా సంపుటి

పుస్తక సమీక్ష

అర్ధ శతాబ్దిపైగా ఆకాశవాణి, దూరదర్శన్, సినిమా, లలితా గీతాలు, సంగీత నృత్య రూపకాలు, వివిధ ముక్తకాలు, నాటకాలు, డాక్యుమెంటరీలు, టీవి ధారావాహికలు, చిత్రాలకు కథమాటలు, పాటలు, బహుముఖ సాహితీ ప్రజ్ఞాశాలిగా జాతీయ, అంతర్జాతీయ మన్ననలు పొందుతున్న డా॥ వడ్డేపల్లి కృష్ణ 'ఉద్గీత' కవితా సంపుటి వెలువరించారు. 'భారత్ భావన' కవితలో 'ఉత్తర హిమనన్నగ శిఖరంపై దూకే ఉత్తుంగ గంగా తరంగలా 'సవీప భారతాన్ని నయనానందంగా తీర్చాలి' అంటూ జాతీయ కవిగా ప్రబోధించారు. ఈ సంపుటిలోని 69 కవితలలో కరోనా కల్లోలిత స్పందనలు, వివిధ పత్రికలలో ప్రచురితమైన వైవిధ్య ఇతివృత్తిల భావనలు చోటు చేసుకొన్నాయి. కవిత్వమంటే 'సుప్తజగతిని తట్టి లేపే సప్తవర్ణ కిమ్మీరం, ఉన్

నానీలు

పండు ముసలితనంలో
తోడుగా ఉండేది
చేతికర్ర
మాత్రమే సుమా!

బిచ్చగాడి బొచ్చెలో
బచ్చంపడే దాకా
ఎదురుతెన్నులే
పాపం!

పెన్షనర్లకు ఎకౌంట్లో
బత్యం పడేదాకా
టెన్షన్.. టెన్షన్..!
అయ్యో.. పాపం..!

అభినందనకు
స్వీకరించు
పొగడ్తను
పట్టించుకోవద్దు.

గుండె లోతుల్లో
ఉబుకుతుంది
మనసువిప్పి మాట్లాడుతుంది
మాతృభాష.

మమతలు
అమ్మకే సొంతం
అందుకే అమ్మనుమించిన
దైవం లేదు.

సత్యాన్ని
అన్వేషిస్తూ ఉండు
స్వతంత్రుడిగా
వెలుగుతూ ఉండు

– బొబ్బిలి జోసెఫ్
సెల్:9989261991

పద్యమే తెలుగు వెలుగు

శ్రీ శుభకర రీతి సిరులొల్కు పద్యము
తెలుగు భాష యందు వెలుగుచుండు
పద్యమందు సొగసు హృద్యమగును సదా
పద్యమేర తెలుగు భాష వెలుగు.

తెలుగు పద్యమెపుడు తేనెలు కురియును
హృదయ వీణ మీటి ముదము గూర్చు
విన్నవారి మదికి విందు గూర్చును సదా
పద్యమన్న తెలుగువారి వాణి.

పద్య పఠన వలన ప్రతిభ పెంపొందుచు
జ్ఞాపకమ్ము పెరుగు జ్ఞానమబ్బు
దాని రుచిని గనిన దాసులౌదురుగాదె
పద్యమందు భాష వన్నె లెన్నొ.

ఊపిరాయె నపుడు నుద్యమాలకు యిది
వైదిక మత బోధ వారధయ్యె
భక్తి భావమలర బాసటయ్యెను చూడ
నీతి శతక రీతి నిలిచె గాదె

పద్య నాటకాలు ప్రజల మదిని దోచె
పంచ కావ్యరీతి ప్రథతి చెందె
పదము పదము లోన మధువులూరించగ
పద్యమిచట నిలిపె బాస పొలుపు

వాన కురియ పుడమి పరవశించినటుల
పూవు మురియు నటుల తావి జేర
ఆమని గని పికము లాలపించునటుల
పద్యం మొకటి వినగ పరవశమగు.

ఆవకాయ పప్పు నారగించినటుల
పదము పదము పాడ మధువు లూరు
అమ్మ లాలి పాట హాయి గొల్పెడి రీతి
పద్యమందు కురియు భావ ధార.

కమ్మ గాను పద్య గానమొకటి విన
శిశువు పశువు లైన శిరము లూపు
మనసు మురిసి మనల మైమరపించును
పద్యమనిన తెలుగు భాష యాస్తి..

పద్యమెపుడు పాత బడదు ప్రజల యందు
నాట్యమాడు చుండు నాల్కలందు
రాగయుక్తమై సరాగమై వర్ధిల్లు
పద్యమేర తెలుగు భాష రాణి.

వచన కవనమందు భావ మలరు చుండు
పద్యమందు భాష పరిఢవించు

పద్యమెపుడు నిలుచు పాఠక డెందాన
నవ రసముల విరిసి నాట్యమాడి

–రాఘవ మాస్టారు
9741407099

వేనోళ్ళ కీర్తి బావుటా సిరిసినగండ్ల "సిరిమల్లెలు"

బాల్యం అమూల్యమైనది. అమృతమయమైన బాల్యం అనిర్వచనీయం. చిన్నికృష్ణుల ఆటపాటలతో నిత్య బాలగోకులం బాల్యం. అట్టి బాలలకు మంచి, నీతి, న్యాయం అంశాలను జోడిస్తే అట్టి బాలల భవిష్యత్తు బంగారుమయం అవుతుంది. పుస్తక పఠనం ద్వారా వివేకం పొందేటి బాలలు ఒక అడుగు ముందుకేసి, పుస్తకాల రచనలు చేస్తుంటే అమితానందం కలుగుతుంది.

సిరుల కల్పవల్లి సిరిసినగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిత్య చైతన్యశీలురై, విభిన్న ఆలోచనలతో పలు వక్రియల రచనల బాట పట్టడం సంతోషదాయకం. పాఠశాల విద్యా, సాహిత్య, వ్యవసాయ పలు రంగాల్లో నిష్ణాతులైన తెలుగు పండితులు పిన్నింటి మహేంద్రారెడ్డి సంపాదకీయంలో "సిరిమల్లెలు" సిరిసినగండ్ల బడిపిల్లల కవితలు చిన్నారుల రచనల సంకలనం రావడం అభినందనీయం.

ఇట్టి "సిరిమల్లెలు" పుస్తక సంకలనంలో శత కవితలు ఉండడం విశేషం. ప్రతి విద్యార్థి వినూత్నమైన శైలిలో, సమాజంలో తాను చూసిన అంశాలను కళ్ళకు కట్టినట్లు కవితలు రాశారు. వాటిని పరిశీలిస్తే



"చినుకు తాకిడికి
విత్తులన్ని నేలపొరల వాకిళ్ళ నుంచి
ఉదయించి కొత్త లోకాన్ని చూస్తాయని"అంటూ తొమ్మిదో తరగతి విద్యార్థిని గడ్డం సాధిక చక్కని కవిత రాసి, మంత్రముగ్ధుల్ని చేసింది.

"అలాగే మరో గేయంలో
సిరిసినగండ్ల పిల్లలం
మెరిసిన ధృవతారలం
విరిసిన మందారలం" అంటూ మరో విద్యార్థిని "దబ్బెట నిఖిత" చక్కగా పాడుకునే విధంగా గేయాన్ని రూపకల్పన చేయడం జరిగింది.

ఇలా సిరిమల్లెలు సిరిసినగండ్ల బడి పిల్లల కవితలు పుస్తక సకలనంలో ప్రతి రచన ఆణిముత్యం. సిరిసినగండ్ల బడిపిల్లల కవితలు "సిరిమల్లెలు" బాలసాహిత్య పుస్తకం బాలసాహితీ జగత్తులో నింగికి, నేలకు నిచ్చెన వేస్తూ, ఊయల బాటలు వేయాలని, ఇట్టి పుస్తకం బాలసాహితీ క్షేత్రంలో వేనోళ్ళ కీర్తి పొందాలని ఆశిస్తున్నాను. ఈ పుస్తక సంకలనంలో రచనలు చేసిన విద్యార్థులు భవిష్యత్తులో ఆయా వృత్తులలో స్థిరపడినా సమాజ శ్రేయస్సు కొరకు చైతన్యానికి పాటుపడే సాహిత్య రంగంలో ఉండాలని రచనలు చేసిన చిన్నారి బాలకవులకు ఆశీస్సులు అందజేస్తూ, పుస్తక ప్రచురణ యజ్ఞానికి ముందు నిలిచిన గౌరవనీయ ఉపాధ్యాయ బృందానికి, కవి, సమాజ సేవకులు, తెలుగు పండితులు పిన్నింటి మహేంద్రారెడ్డికి శతకోటి వందనాలు

ప్రతులకు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిరిసినగండ్ల–502 372
మం॥కొండపాక, జి॥సిద్దిపేట
సెల్:9441732792

–ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

స్నేహం..!!

బాల్యమో కౌమారమో
తెలిసీతెలియని వయసులో
మొగ్గ తొడిగిన స్నేహం..!!

విరిసీ విరియని పుష్పమై
జ్ఞాపకాల రేకులను విచ్చుకుంటూ..
నా ఎదలో వెదజల్లుతూనే ఉంది
స్నేహబంధ సుగంధాలను ఈనాటికీ..!!

కాలంతోపాటు రాలిపోయిన
ఆ క్షణాలన్నీ..
గుట్టుగా..
నా గుండెలనిండా
గుట్టగా పేరుకుపోయాయి..!!

గుర్తొచ్చిన ప్రతీసారీ
గుండె సంద్రమై పొంగి..
కన్నీటి అలలు కంటిపాపలను
తాకుతూనే ఉన్నాయి..!!

తీపి జ్ఞాపకాలను పంచుకుని..
తీరని తీపి బాధలను మిగుల్చుకుని..
బతుకుదారుల్లో అందరం తలోదారిలో
విడిపోయాం..!!

ఎవరెవరం ఏ దూరతీరాలలో
ఉన్నామో నేస్తాలూ..
ఈ తీరంలో నేనున్నాను..!!

స్నేహం అంటే
ఏమో ఎన్ని రకాలో..?!
కానీ
బాల్యస్నేహం మాత్రం వేరు..!!
అసలు స్నేహం అంటేనే బాల్యం
బాల్యం అంటేనే స్నేహం కదా..!!

ఎన్నటికీ
చెదిరిపోని చెరిగిపోని
తీపి జ్ఞాపకాల సందోహం..!!
ఇది నిజం !!

కాలం మరలి రాదు..
కానీ బాల్యం తిరిగి వచ్చేస్తుంది..
ఎప్పుడో తెలుసా..?!

చిన్ననాటి స్నేహితులు మళ్ళీ కలిసినప్పుడు..!!
ఆ తీపి జ్ఞాపకాలను
తనివితీరా పంచుకున్నప్పుడు..!!
ఔను ఇది నిజం !!

అందుకే ఎప్పటికీ భద్రమే
నా బాల్య మిత్రుల చెలిమి..
గుండెనిండా వెలకట్టలేని కలిమి..!!

నా సైన్సుపుస్తకంలో
దాచుకున్న నెమలీకలా.. !!

–పేరిశెట్టిబాబు
9247170800

నిరీక్షణ

ఎండకూ, వానకూ
స్వేదాన్ని చిందిస్తూ
ఈ కాయాన్ని మీకర్పించి
శ్రమ జీవులమై అహర్నిశలు
మీ కోసమే శ్రమిస్తున్నాము.

మా ఆరోగ్యం మీకనవసరం
మా బాగోగులు మీకు అప్రస్తుతం
మా చాకిరీ మీకు అత్యవసరం
మాకు చాకిరీ కొండంత
మాకిచ్చేది మీరు రవ్వంత.

కొండలను పిండిచేసి
భావనాలను కట్టేది మేము
మా శ్రమను దోచుకొని
భోగాలను అనుభవంచేది మీరు.

యుగాలు మారినా
దోపిడీ మాత్రం మారలేదు
ఎన్నిరోజులీ దోపిడీతనం
ఎవరితో చెప్పాలి మాదీనత్వం.

ఎన్నో "మే"లె వస్తున్నాయి
ఏ 'మే' కూడా మాకు మేలు చెయ్యందే?
మా రెక్కల కష్టం! మాక్షుద్బాధ
తీర్చే ఓ క్రొత్త పొద్దు కోసం మా నిరీక్షణ!!

– వెల్లాల ఉమా మహేశ్వర శర్మ
సెల్: 9290590653

మర్చిపోతున్నారు.....

అమ్మ పాలు వదిలి
అమ్మకం పాలు రుచి చూచిన్నప్పుడే
అమ్మ భాషను మర్చి ..
అమ్మకం భాషకు బానిస అయ్యారు?
స్వేచ్ఛగ తెలుగు భాషను
మాట్లాడానికి మొహం చాటేసు కుంటు
బడాయి భాషను బ్రతికిస్తు
గొప్పగ బ్రతుకుతున్నమని
అనుకొంటున్నారు కాని
బ్రతుకంతా బానిసేనని మర్చి పోయారు !!

నేడు పరాయి భాష కోసం
ప్రకులదుతున్న వాళ్లంతా
విదేశాలుకు పారిపోయి
కన్న వాళ్ళను అనాదులుగా చేసి
వాళ్ళ కన్నీటికి కారణమవుతున్నారు
తెలుగు జాతి ఆత్మ గౌరవానికి
తెలుగు భాష మనుగడకు
భంగం చేకూరుస్తున్నారు
చీకటికి వెలుగు కరువైనట్లు
తెలుగుకి తెలుగు వాడు మరుగౌతున్నడు!!
పెద్ద పెద్ద చట్ట సభలలో
సూటు బూటు వేసుకొని
అర్థం కాని పదాలతో
ఫ్యాషన్ ఫ్యాషన్ గా
ప్లాస్టిక్ నవ్వుని మొకానికి తగిలించుకొని
మైకుని అటుతిప్పి ఇటు తిప్పి
నాలుగు మాటలు మాట్లాడి
మురిసి పోతున్నారు ..
మతిహీనులై మాతృ భాష ద్రోహులై
మాతృ భాషను మరిచి పోతున్నారు ?

–లక్ష్మీ శ్రీనివాస్
9676601192

కవి

కనిపించని
వినిపించని
అన్ని
హృదయం తో చూసి
ఒక లక్ష్యం కోసం
మెదడు తో శ్రమిస్తూ
మార్పు కోసం అన్వేషిస్తూ
పిచ్చి ఆశతో సమాజ క్షేత్రంలో
ప్రజా పక్షమే అతని నైజం
భయం లేదు భావన తప్ప
అక్షారాల ను పిరంగులుగా
అక్రమాల పై పేల్చగలరు
హృదయ తన్మయత్వం లో
తనకు తానే సాటి
ఎండలో వాన
వాన లో ఎండ
ఎడారి లో మంచు
గుండెలను పిండి చేయగలడు
హాస్యం తో ఆయుష్షు పోయాగలడు
దేశ నిర్మాణంలో పునాది
సృజనలో మేటి
మాటల్లో వాగ్ధాటి
ఆయన కులం అక్షరం
ఆయన ప్రాణం మానవత్వం
సమసమాజమే హితం
కొందరి దృష్టిలో అది పిచ్చి
అది అంతరానుభూతి
కవి కలం తో వికాసం కోసం
ఆరాటపడే హృది
అగ్గిపుల్ల నుంచి ఆకాశం
ఆహార్యం నుంచి ఆత్మవిశ్వాసం
గల్లీ నుంచి విశ్వం వరకు
అన్నీనీ టినుంచి
కవిత వస్తువును
ఎంపిక చేసుకొనే
దిట్ట !స్రష్ట!!

–ఉమాశేషారావు వైద్య
9440408080

బాల్యం

అమ్మ చేతి ముద్దలను తింటూ
జాబిలమ్మ పాటలను వింటూనే
చిలుక పలుకులు నేర్చేదే బాల్యం.

నాన్న చిటికెన వేలు పట్టుకుని
బుడి,బుడి నడకలు నేర్చుకునే
నడవడికకు నాందీ ప్రస్థానం బాల్యం

అమ్మమ్మ కమ్మని కథలు వింటూ
బంధాలకు గట్టి పునాదులు వేస్తూ
భారత పౌరునిగా తీర్చిదిద్దేది బాల్యం.

తాతయ్య అనుభవాలను కంటూ
బాధ్యతలను పరిచయం చేస్తూనే
ఉన్నత విలువలను నేర్పేది బాల్యం

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

పుస్తక సమీక్షలు

కళిగాంధ్ర భాష యాసకు పట్టం

తెలుగువారు గర్వించదగ్గ రచయితల్లో చింతకింది శ్రీనివాస రావు ఒకరు. దాలప్ప తీర్థం (2013) కాన్పులదిబ్బ (2016) కప్ప స్థంభం (2018) బుగతల కాలం నాటి చుక్కపల్లి-నవల(2019) ఉడుకు బెల్లం (2021) మున్నీటి గీతలు. తానా బహుమతి నవల (20 22) కథా సంపుటాలు, నవలలతో పాఠక లోకాన్ని అలరించారు. జీవిత వైరుధ్యాలు. కలిమి లేముల మధ్య వ్యత్యాసాలు కళింగాంధ్రుల మధ్య మరీ స్పష్టంగా కనబడుతాయేమొ. లేక ఇలాంటి వైరుధ్యాలు పసిగట్టే అంతర్నేత్రం కళింగాంధ్ర రచయితలకు మరీ ప్రత్యేకంగా ఉంటుందేమో లేదా ఆ గాలీ, నేలా రచయితల్ని ప్రత్యేకంగా మలుస్తాయేమో తెలి యదు కాని చాసో, రావిశాస్త్రి, పతంజలులు కళింగాంధ్రలోనే పుడతారు. చింతకింది శ్రీనివాసావూ ఇదే కోవలోకి వస్తారు.

శ్రీనివాసరావు వివరించే కథల్లో, కథల్లోని పాత్రల చిత్రణలో కథ వివరిస్తోన్న సందర్భము, పాత్రలు తప్ప మరేవీ పాఠకుడికి కనిపించవు. జీవన వాస్తవికతల్లోంచి కథా వాస్తవికతకు మనల్ని దింపుతారు. మన చుట్టూ ఉన్న జీవితాల్లోంచే, మనం ఎన్నడూ ఊహించని రంగుల్ని కనబర్చుతారు. ప్రఖ్యాత రచయిత సల్మాన్ రష్దీ సాహిత్యం గురించి ఇలా అంటారు. "A Book that opens some door in their (Readers) head that had not been opened before". శ్రీనివాసరావుగారి రచయితల్లో సరిగ్గా ఇలాగే అనిపించుతుంది. కథ, కథతో పోటీ పడుతూ కథనం. ఈ రెండూ

నువ్వా, నేనా అన్నట్లు పరుగులు తీస్తాయి. 'జుగల్ బందీ' చేస్తాయి. ఒక్కో చోట కథనం–ఉత్తరాంధ్ర యాస భాషతో కథకంటే బావుంటుంది. అందుకే కప్పస్తంభం కథా సంపుటికి శ్రీ రమణ ముందు మాట రాస్తూ "మాండలికానికి పట్టిన పల్లకి" అంటారు. "కళింగాంధ్ర మాండలికం సింహాచలం సంపెగల్ని, పలాస జీడిపప్పుని మరిపిస్తుంద"ంటారు.

ఇక ప్రస్తుత 'బుగతల నాటి చుక్కపల్లి' నవలలో కథకంటే శిష్టాచార బ్రాహ్మల భాష, యాస రాజ్యమేలింది. వీరిలో శాఖాబేధాలు పొటమరించి లేనిపోని తగవులు వ్యక్తిగతాలను తెచ్చి శాఖలకు అంటించి భ్రష్టు పట్టారని నిర్ణయిస్తారు రచయిత. ఇందుకు రచయితే పరిష్కారం చూపి ముగిస్తారు. నవలనిండా చుక్కపల్లి అగ్రహారికుల మాటలు యాసలు ఎంతో వివరంగా కనబడుతాయి. వెలకట్ట (పే.7) ఎర్ర నాగుల గావంచా (పే.9) పెంటచ్చి గాళ్ళు (పే.8) బాజోటు (18) దేవూదీవుమంటు కనిపించటం (పే.23) అపుగరా (పే.25) పరిష్యంపట్టటం (పే.25) మచ్చుకు మాత్రమే!

ఇక వీరు ఉదహరించిన సామెతలు అక్కడి నానుడులు కోకొల్లలు 'కొత్త వారికి–పులుపు తీరిపోతుంది. పులుసు కారిపోతుంది (10) 'సిసలైన భాస్వరం (11) 'పేడలో ముంచిన చెప్పుతో కొట్టాలని పించటం (13) 'సరదా.. దురదా' (14) 'కచ్చలో కందులు వేపటం (14) ఏళ్ళు ఎగసన బుద్ధి దిగసన (27) వంటివి కోకొల్లలు.

ఒకవేళ కొన్నిపదాలు సామెతలు ఇవ్వేళ్ళ లేకపోయినా పరభాషా వెల్లువలో అవికొట్టుకుపోయినా, వాటిని సజీవంగా ఉంచాలన్న రచయిత ప్రయత్నం ఎంతో ప్రశంసనీయం. ఆనాటి బుగతల ఆచార వ్యవహారాలను, నమ్మకాలను, జీవన విధానాన్ని ఒక 'మ్యూజియం'లో ఉంచి ప్రదర్శించిన రచయిత ప్రయత్నం అభినందనీయం. విశాఖపట్నం జిల్లా చోడవరం తాలుకా చుక్కపల్లి అగ్రహారంలోని పెచ్చు మంది మగ మహారాజులకు పేకాట ఒక వ్యసనం. లక్ష్మణ బుగతమిద్దె ఇంటి వీధి అరుగు మన కార్యస్థలం. ఈ అరుగుసొద. చుక్కపల్లి బుగతల కథే ఈ నవల. ఔత్సాహికులు పిహెచ్‌డి చేయగలిగినంత సరుకున్న నవల!

ప్రతులకు: శ్రీనిజ ప్రచురణలు
6-60/1, రవీంద్రనగర్
ఓల్డ్ డైరీ ఫార్మ్
విశాఖపట్నం–530 040
ఆంధ్రప్రదేశ్
సెల్:8897147067

– కూర చిదంబరం
సెల్: 8639338675

ఆకాశం అందుతోంది

నూతిని దాటాలని కప్ప పిల్ల
నీటిని కాచాలని అగ్గిపుల్ల
మురికిని కడగాలని సబ్బుబిళ్ళ
వీధిని రక్షించాలని కుక్కపిల్ల

ఆకాశాన్ని అంటాలని అల
శిశిరాన్ని మింగాలని కోయిల
ఉత్సాహంతో, ఆరాటంతో
ఉరుకులు వేస్తూ... పరుగులు తీస్తుంటే
ఓ మనిషీ నీవెందుకు
ప్రయత్నానికి దూరంగా
నిరాశ నిస్పృహల చీకటిలో
ఆత్మవంచన ముసుగుతన్ని
కాళ్లు ముడుచుకుని నిద్రపోతావు
ఓటమికి ఎదురు నిలిచి
ప్రయత్నించు సాధించు
ఆకాశమే అందుతుంటే
ఇలలో మనకు అందనిదేముంది?

–డి.కె. చదువుల బాబు
9440703716

వగరు పిందెలు

తూర్పు తిరకాసు పిట్ట
తీక్షణంగా చూస్తున్నా
అప్పో సొప్పో చేసి
బతుకు వేర్లు నీకోసం
నాలుగు పచ్చని ఆకులు వేస్తూనే ఉంది.

పచ్చని చేలోకి మిడసర మబ్బులు
కడగండ్లు విసిరినా
నిన్ను సంతోష పెట్టాలని
మా సహన హలం
జీవితం దున్నుతూనే ఉంది.

అలారం పెట్టకపోయినా
రంచునుగా గొంతు సవరించుకుంటావు.

మా రణ గొణ ధ్వనుల మధ్య
పల్లవి పల్చబడుతున్నా
చరవాణి రొదలో
చరణం రాలిపోతున్నా
పట్టించుకోలేదని చిన్నబుచ్చుకోవద్దు.

నాలుక కల్లీ పడి
రుచులు తెలియడం లేదు గాని
కొత్త ఏడు పచ్చడి
కొని ప్రిజ్జులో దాచేశాం
ప్లాస్టిక్ పువ్వులు ఎలాస్టిక్ నవ్వులు
ఒక్కరోజు వేదిక పైకి
చిటికె దూరంలో చేర్చేశాం.

బద్ధకమని పొరపడకు
సాంప్రదాయ కోయిలకు
వంత పాడాలి కదా మరి!
నీవు మాత్రం
వగరు పిందెలని వరస మారక
ఆదాయాలు అలసి పోకుండా
వ్యయాలు విస్పోటించకుండా
ఓ కమ్మని పాట పాడేసుకో!

–నల్లు రమేష్
9989765095

రామతత్వం

మానవుడన్నపుడు
మంచీ చెడులుంటాయని
కష్ట సుఖాలు
సహజమని!!

అతిప్రేమ అనార్థానికి
హేతువని
అడగకూడని వరం
కోరకూడదని!!

అత్యాశ అసలుకే
మోసమని
మనిషిలోని మోహం
ప్రమాదకరమని!!

స్నేహం ఎంతో
ప్రీతిపాత్రమని
నమ్ముకుంటే దేవుడు
మనలోనే ఉంటాడని!!

భక్తి ఉంటే ఎంగిలికూడా
తీపి అని
ధర్మానికి బంధుత్వం
అడ్డుకాదని!!

అనుకుంటే సాధించడం
సాధ్యమని
మనలోని బలం
మహా గొప్పదని!!

బోధించే తత్వం
రామతత్వం!!

–జగ్గయ్య.జి
9849525802

కిరణాలు- నా చరణాలు

విశ్వశ్రేయస్సుకై సతత శ్రీ కారానికై
నవ వసంత శోభకృతులకై
కన్నులలో చైతన్య దీప్తిని నింపుకొని
కవుల మమతల కరుణను వంపుకొని
గతాన్ని పథాన్ని గళంలా సరిచేసుకుని
ఆకుపచ్చగా కుస్తూ ఉంటుంది !
నవరసాల సంతకం –
షడ్రుచుల వసంతకం
చేస్తూ ఉంటుంది ... ఈ వసంత కవి కోకిల !
కడుపు మంటలపై హరితవనంగా కూర్చుని
వీపును శ్వేత సింహాసనం చేసుకొని
హృదయం నిండా పూర్ణచంద్రికలతో
కొమ్మలను రెమ్మలను ప్రేమతో స్పృశిస్తూ
చిన్ని చిన్ని చివురులను అనురాగపు
ఆశీస్సులతో దీవిస్తూ దీప్తిస్తూ ఉంటుంది!
చెట్టు చెట్టుపై పక్షి గూడును ప్రతిక్షేపిస్తూ
ఆకులన్నింటినీ ఆకుపచ్చని చిలుకలుగా చేస్తూ
పువ్వులన్నిటినీ సీతాకోకచిలుకలుగా పూయిస్తూ
కాయలన్నిటినీ సుతలపు కాయలుగా కాయిస్తూ
తూనీగలు పుడమి శకుంతల తలపై
చిగురుటాకు పెదాలపై వాలుతూ ఉంటే...
నేను దాన్ని తామరాకులపై
విరిసిన దళ పత్రాల పతంగిలా
ఎగురవేయాలని తపిస్తూ
ఉంటాను రెక్కలన్నీ పూల పత్రాలే!
చూపులన్నీ పూల పరిమళాలే!
సుగంధ భరిత వనంలో
ప్రతి అడుగు దివ్య పారిజాతమే!
పరమాణువు నుండి పరబ్రహ్మ తత్త్వం వరకు
నుదుటి హృదయమంతా–
సౌందర్యం అంతా సుందరకాండయే!
చెట్లన్నీ చేల కలాలే !
ఆకుపచ్చని వెన్నెలను అమృతంలా
వెదజల్లుతూ ప్రాణికోటి నాదం అంతా
బాలగాంధర్వసంగీతం అవుతున్నది !

కోటి రాగాల హితం అంతా
విశ్వనాథ సారస్వత సాహిత్యం
అవుతున్నది !
ఈ విశ్వనాథుని సృష్టి
పరమపదార్థమై ఉన్నది
ఆ పదం శోభాయ మానమై వచ్చింది!
అర్థం వైభవం కై
వెలుగునిచ్చెనై వాలింది!
ఇదుగో !
వసుంధర వేలవేణువులయి మ్రోగింది!
అదిగో!
సూర్యుని కిరణాలన్నీ నాచరణాలే!
కావాల్సింది ఆ చరణాలే! ఆ
చరణాలే!

–డా.పింగళి గంగాధర్ రావు
9014101975.

అతడే..

పుట్టుక నుంచే అడుగడుగునా అవమానపు విషగుళికల్ని మింగి
నిలువెల్లా దాచుకున్న గరళ శరీరుడు!

తరాల కుల జాడ్యపు గండ శిలల్ని ఆత్మ స్థైర్యపు మందు గుండుతో పేల్చి
లోన దాగిన మానవతా ఊటను వెలికి దెచ్చిన సమరయోధుడు!

అవిద్యే వెనుకబాటుకు హేతువని గ్రహించి, అవాంతరాల నదులన్నింటినీ ఈది
ముప్పదిపైగా పట్టాలను సాధించిన సరస్వతీ పుత్రుడు!

పేరుకుపోయిన మూఢాచారాల చీకట్లను జ్ఞాన దీపంతో తరిమికొట్టి
మనుష్య ధర్మాల నుద్ధరించిన మేధోసంపన్నుడు!

సమానత్వ సాధనా యజ్ఞానికి అజ్ఞానాహంకారాలను సమిధలుగ జేసి
అలుపెరుగని పోరాటాన గెలిచి నిలిచిన వజ్ర సంకల్పుడు!

సామాజిక సమస్యలే ఊపిరిగా, సంఘర్షణే సాధనా మార్గంగా
పరిహితార్థం జీవించిన కారుణ్య మేఘుడు!

అట్టడుగు వర్గాల నాదుకునే సంకల్పంతో రిజర్వేషన్లను
రాజ్యాంగాన చేర్చిన మహోన్నత దార్శనికుడు!

అస్పృశ్యుడిగా వెలివేయబడినా.. ఉన్నత విలువలతో
అందరి మనసుల్ని స్పృశించిన మహా నాయకుడు!

సముద్రమంత సహనాన్ని ఊతకర్రగా మలుచుకుని
స్వీయ శిక్షణతో శిఖరాగ్రం చేరిన "భారతరత్న" మితడు!

అతడే.. బాబాసాహెబ్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్!
అమరుడై నిలిచిన అణగారిన వర్గాల ఆత్మబంధువుడు!.

– ఎస్. కాశింబి
సెల్: 9052216044

మహిళా కథకుల హృదయాంతర్గత చైతన్య రూపాలు- ముంగారు మొలకలు

'ముంగారు మొలకలు' అనంతపురం జిల్లా మహిళా కథకుల 25 కథలు, యం.ప్రగతి, జి. నిర్మలారాణి, బి. హేమమాలిని సంపాదకులుగా సంకలనం వెలువరించారు. జిల్లా రచయిత్రులుగా నిర్ణయించే కొలమానా లలో అక్కడ పుట్టి పెరిగి, అక్కడే స్థిరపడినవారు, ఇతర జిల్లాలలో పుట్టి వివాహ, ఉద్యోగరిత్యా అక్కడికొచ్చి స్థిరపడినవారు, అక్కడ పుట్టిన పెరిగి ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డవాళ్ళు అందరినీ పరిగణలోకి తీసుకొన్నారు. ఇప్పుడే తలెత్తుతున్న కథా రచయిత్రులు కూడా వుండటంతో, సంకలనానికి 'తొలకరి' మొలకలు పేరు పెట్టారు. నాలుగు తరాల మహిళలు రాసిన ఈ కథలు, సామాజిక చైతన్యం, జీవిత సత్యాలను ప్రతిబింబింప చేస్తున్నాయి. తొలికథ ముసుగు తీసిన హేతువు (అమళ్ళదిన్నె పద్మజ) ఇంగితం ముసుగు తొలగి హేతువు కళ్ళు తెరిచిన కథనంగా, ఆకట్టుకొంటోంది. క్రీడలలో కుల వివక్ష



అంశంపై ఆటపట్టు (చిలుకూరి దీవెన) ప్రేమో న్మాదం నుంచి జీవితం చేజారిపోని యువతి 'పరిణీత' (సిఎం. అనురాధ) ఇత్యాది మంచి కథలున్నాయి. ఆలూరి లక్ష్మీదేవి 'మనసున మనసై' కథలో ఇందిరా, సోనియాల మానసిక సంఘర్షణల రాజకీయ కథనం ప్రస్తావించడం, ఎం.కె.దేవకి తన 'సంపూర్ణక్క–తమసుమానం' కథలో ఒక పల్లె మహిళ జీవితంతో పెనవేసుకొన్న ఆధ్యాత్మికత భావన, జి. నిర్మలారాణి 'పల్లె వెలుగు' కథలో ప్రయాణ సంఘటన, సీనియర్ కథయిత్రుల ప్రతిభను వ్యక్తం చేస్తున్నాయి. సింగాడి శోభామణి 'కాకి', కథ, పుట్టపర్తి నాగపద్మిని రచన 'భూల్‌భులైయ్యా..1, ఆవుల జయప్రద 'ఋణచిత్రం', ఆ ప్రాంత మహిళల జీవన స్థితిగతులు ఆశల కోర్కెలు మానవతా విలువలు మహిళల బడుగురైతుల, నిరక్షరాస్యుల జీవన వ్యథలు, కరువు సీమ గ్రామీణ ఆర్థిక వేదన కథా రూపాలుగా ప్రతిఫలింప చేసారు. రెండు తెలుగు రాష్ట్రాలు, యిత రాష్ట్రాలలో స్థిరపడిన తెలుగు కుటుంబాలు, విదేశాలలో వున్న ప్రవాసాంధ్రులు ఎక్కడికక్కడ ప్రాం తీయ అస్తిత్వ విలువల లోతులలోకి వెళ్ళి, కథలు సృష్టించడం, తెలుగు కథా సాహితీ ప్రక్రియను మరింతగా ప్రభవింప చేయగలదనడంలో సందేహం లేదు. 'ముంగారు మొలకలు' ప్రచురించి సంపాదకులు, మహిళా రచయిత్రులు ఎక్కడైనా, ఏ విధంగాను తీసిపోని అద్భుత కథలు సృష్టించగల రని ఈ సంకలనంలోని ప్రతీ కథా ప్రతిభావంతంగా ఆలోచింపచేస్తోంది. కథా రచయిత్రులకు, సంకలనకర్తలకు అభినందనలు.

ప్రతులకు:
యం. ప్రగతి
1-4-193, జానకిరామ నగర్
అనంతపురం–515 004
సెల్: 94407 98008



–జయసూర్య
సెల్:9014948336

నాగన్న పదాలు

నీడ నిచ్చును తరువు
పంట నిచ్చును చెరువు
ధరణి! మోయు మేరువు
ఓరి! నాగన్న.

చింత చేర్చును చితి
పితుర్లతో చెడు మతి
నిదానిస్తే సుకృతి
ఓరి! నాగన్న.

ప్రకృతికి పుత్రుడు
నిరంతర శ్రామికుడు
"బహుగుణ" స్మరణీయుడు
ఓరి! నాగన్న.

కోరికలా ? సహజం
తీరకనే ! సతమతం
శ్రమ శక్తే సఫలం
ఓరి! నాగన్న.

–నెమలికొండ
నాగేశ్వర్ రావు
8688553470

ఓడిన తల్లి కోరిక

ఇటుకలతో కట్టని గోడలో నువ్వు దాగి
నరాల నుంచి ఆహారాన్ని పొందుతూ
నీ అంగాలు దిద్దికుంటునపుడు
నా గుండె గదులు పొంగాయే గానీ క్రుంగలేదు,

రుధిరం క్షీరమై నీ కుక్షి నింపినపుడు
నీ చిగురుకాటు నా కుచముల నొక్కినపుడు
నా తనువు పులకించిందే గానీ తొణకలేదు

నునులేత పాదాలతో ఎగిరెగిరి తొక్కుతూ
నా గుండెలపై తాండవ నృత్యమాడి కేరింతలాడే వేళ
ఆనందం పొంగిందే గానీ అలసట రాలేదు

వొరిగిన వయసున వొదిగిన మనసును
ఎదిగిన కాళ్ళతో ఎగిరి తంతుంటే
అదిరిన రొమ్ము మీద కలిగిన బాధ ముందు
ప్రసవ వేదన చాలా స్వల

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 815వ రోజు 'కుక్కల బెడద' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'కుక్కల బెడద' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

కుక్కకాటు

జీవకారుణ్యమంటూ జీవుల పరిరక్షణ
ప్రకృతిలో జీవుల మధ్యన సంతులనం
లేమార్క్ డార్విన్ చెప్పిన
పరిణామక్రమమెక్కడ
సృష్టి నిర్మాణంలో
ఉద్భవించిన జీవులెన్నో
విలుప్తమైనవెన్నో
ప్రకృతి వరిస్తేనేగా.
జీవుల మనుగడ
కృత్రిమ చర్యలన్నీ
కంటితుడుపు చర్యలేగా
ఈ గ్రామ సింహాల
స్వైర విహారమంతా గ్రామాల్లోనేగా
అడవుల్లో ఉండాల్సిన
మర్కటాలు గ్రామాలపై దాడి
గ్రామాల్లో ఉండాల్సిన
శునకాల జనాభా విస్తరణ ఇప్పుడు
శునకాల నియంత్రణకు
సశాస్త్రీయ చర్యలెక్కడ
చర్యకు ప్రతిచర్య భౌతిక వాదం
మానవ జనాభాను నియంత్రంచినా
కుక్కల జనాభాను నియంత్రించలేని స్థితి
కుక్కల జీవనవిధాన అధ్యయనమెక్కడ?
పరిస్థితులను పరిశీలించకుంటే
విధ్వంసాలేగా
కుక్కల నియంత్రణకు
మీనమేషాలు లెక్కించడమెందుకు?
నేల విడిచి సాము ఎందుకు?
సమకాలీన సమస్యను
పక్కదారి పట్టించడమెందుకు?
చిన్నాపెద్ద గ్రామం పట్టణం
బేధరహితం కుక్కకాట్లు
ఈ కుక్కకాట్లకు చెప్పుదెబ్బలెపుడో!
ఈ శునక ప్రహసనం
ముగిసేదెప్పుడో!.



- లక్ష్మారెడ్డి పసుల

పెను సవాల్

గ్రామ సింహాలు గాడి తప్పినై
కనబడ్డోల్లనల్లా కాటువేస్తున్నై
పిడికెడు మెతుకులకే తోకాడించి
అంత్యంత విశ్వాసం చూపాయి నాడు
దొంగల భయం లేకుండా
గాఢనిద్రనిచ్చాయి యజమానికి
తోడేళ్ల బారినుండి
గొర్రెలూ మేకల రక్షణ
కాపరులకు అండ
అవసరాల కోసం నాడు పెంచితే
ఆనందం కోసం నేడు పెంపకం
చివరికది హోదాకు చిహ్నం
అరిచే కుక్క కరువదనీ
కరిచే కుక్క మొరగదనీ
నాటి సూక్తి
విపరీత కాలమో
వీధి వైపరిత్యమో
అనుకోని దాడులు నేడు
గ్రామ సింహాలు వేట కుక్కలై
మనుషుల వేట
కరోనాలాంటి కొత్తరోగాలొచ్చి
ధవాఖానాలకు విపరీత లబ్ది
నేడు కుక్కలు వారికే అండ
ఆకలి బాధనా కొత్త రోగమా
పశువైద్యులు పరిశోధన చేయాలి
ఈ ఇంట్లో
కుక్కలున్నాయి జాగ్రత్త అనే బోర్డులు
నాడు
ఈ వీధిలో
కుక్కలున్నాయి జాగ్రత్త అనే బోర్డు
వేయాలి నేడు
కొత్త కొత్త అన్వేషణలు చేస్తున్నాం
కొత్త సవాళ్ళను ఎదుర్కుంటున్నాం
ధనాన్ని పెంచడం కన్నా
జనహితానికే పెద్దపీట వేసే
పరిశోధనలు నిత్యం జరగాలి.

-గుండం మోహన్ రెడ్డి

పోవటమెలా

విశ్వాసానికి మారుపేరు కుక్క
సహజ గుణం విడిచింది ఎందుకో!
మనుష్యులకు మంచి నేస్తమే
బెదిరిస్తూ బెదరగా మారింది
ఎందుకో!
బయట బజారులో తిరగాలంటే
బెంబేలెత్తే బాలలు వృద్ధులు
ఇద్దరూ బలహీనులనా?
ఏమీ చెయ్యలేరనే ధీమానా?.

వింత ప్రవర్తన

విశ్వాసానికే వీర చిహ్నం
వీధి మొత్తానికే కాపలా
ధైర్య సాహసాలకు పెట్టింది పేరు
మనిషికి దాపు.
నిశిరాత్రి ఒక్క కుక్క భౌమంటే
ఎక్కడెక్కడో తచ్చాడేవన్నీ
తప్పకుండా గొంతులు కలిపి
దొంగో దొరో తేల్చేంత జ్ఞానం.
ఇంటికైనా పంటకైనా
పశుల మందలకైనా
అంటిపెట్టుకుని నమ్మకానికి
అమ్మలాగా ఉంటాయనుకుంటుంటే
ఉన్నట్టుండి ప్రకృతి తిరగబడింది
కాలుష్యాల బెడదలో
కల్తీల లీలలో
తోడు నిలవాల్సిన గ్రామసింహాలు
తోడేళ్ళలా పీక్కుతింటున్నాయి.
పరిహాసాలు మాని పాలకులు
విజ్ఞానం కోసం శాస్త్రజ్ఞులు
వింతప్రవర్తనల సంతను
కట్టడి చేసే కార్యక్రమం పెట్టుకోవాలి.

- నగునూరి రాజన్న

శునక గోల

ముందుకాలం గ్రామ సింహాలు
ఇప్పుడు స్ట్రీట్ డాగ్స్
శునకాలలో రకాలు
పెంచుకుంటే ముద్దు కుక్క
అప్పుడు కుక్క అంటే కోపం!!.
ఇప్పుడు ఇవి
దొరికితే తింటాయి
పెడితే తింటాయి
తిన్న దానికి
ఆ ఉన్న స్థలం నాది అని
అరుపులు కరుపులు.
దుష్మత్యాలు ఇంతా అంతా కాదు
మళ్లీ విశ్వాసానికి ఏమో పెట్టింది పేరు
జాతకాన్ని బట్టి రాత.
ఏమైనా ఈ కుక్కలు
నిద్దరకి శత్రువులు
అందుకే ప్రభుత్వాలు
కుక్కల బండ్లు పెట్టాయి తీసుకెళ్లడానికి
కరవకుండా చూసుకోవాలి
లేకపోతే సూదుల గొడవ
వద్దండీ బాధ శత్రువులకైనా
అందుకే ప్రతీ రోడ్డుకు
బోర్డులు పెట్టాలి
ప్రాణాలకు రక్షణ తప్పదు
తప్పించుకోలేని సహ జీవనం
ఎవరి జాగ్రత్తలో
వారు ఉండక తప్పదు
మనని మనం రక్షించుకోక తప్పదు!!.

-కె.కె.తాయారు

అభోజనం

దిక్కు మొక్కు లేక
చెత్తకుప్పల్లో తిండి కోసం వేట
రోడ్డు మీద కాపలాకాస్తూ
ధర్మాత్ములు పెడితే
నమ్మకానికి ప్రతీకగా నిలిచే
జాతి జీవాలు కొన్ని!!.
ఆరోగ్యం కాపాడుతూ
ఆహారం పెడుతూ
పెంచుకుంటున్న యజమానికి
విశ్వాసాన్ని చూపుతూ
ఇల్లే దైవమనుకుని
ప్రేమతో స్వేచ్ఛగా తిరుగుతూ
రాజయోగం అనుభవించేవి కొన్ని
ఏనాడు చేసుకున్న పుణ్యమో మరి!!.
చిత్తకార్తిలో రెచ్చిపోతూ
అధిక సంతానోత్పత్తిని కలిగిస్తూ
గల్లీ గల్లీలో
గాలికి తిరుగుతూ
వచ్చిపోయే వారిపై పిచ్చితో
రెచ్చిపోయి కాటేస్తూ
ప్రతాపాన్ని చూపిస్తూ
భయపెట్టే
శునకాలకు హద్దేది!!.

ఇదా మనిషి విలువ?

ఇక్కడ భౌభౌ
అక్కడ భౌభౌ
భౌభౌలతో మోదకు
కండలూడేలా పీకి
రక్తంనాకే శునకాలు
చూపుతున్నాయి నరకద్వారాలు!
పులి సింహాలు మేలు!
ఈ గ్రామసింహాలు
అడవిలో ఉండాల్సినదే ఇక సార్లు!
భూతదయపేరుతో
శునకప్రేమికులు!
చిన్నారుల ప్రాణాలు హరీఅన్నా
శ్వానాలు పట్టేవారు
తూతూమంత్రంగా ఎంచక్కా
తిరిగి వదిలేరు!.
మనిషికంటే విలువైనదా శునకం!
అరిచేకుక్క కరవదన్నమాట
శుద్ధ అబద్ధం!
ఇంజక్షన్లు మందులతో
మనిషి కుదేలు
సిమెంటు కట్లతో బేజారు
గోమాతకు లేని గౌరవం
కుక్క మేలు గత కాలం
నేడు కుక్కల బెడద ఓశాపం!.

-వి.రాజ్యశ్రీ

ప్రతిఫలనం

అత్యంత విశ్వాసముండే
జంతువు కుక్కనే
పెంపుడు కుక్కలేకాదు
ఇంటిముందు తిరిగేవికూడా
ఎప్పుడో ఒకసారి
మిగిలిన చద్దన్నం పెట్టామని
కృతజ్ఞతతో కాస్తాయి ఇంటికి కాపలా
ఇంటికి కన్నం వేసేందుకు వచ్చిన
దొంగలనే కాదు
రాత్రిపూట
కొత్తమనుషులను చూసినపుడూ
దొంగలనుకొని వెంటబడేవి.
ఇప్పుడేమైందో
వాటి జన్మలక్షణాలనొదిలి
వంటరి మనుషులపై
చిన్న పిల్లలపై
శత్రువులాగా దాడులు
ఆహారం కొరకేనా?
అనారోగ్య ప్రభావమా?
నీడనిచ్చే వేపచెట్లు ఎండిపోతుంటే
కారణం కొరకు కొట్లాడుకుంటున్నం
ఇప్పుడు
కుక్కల బెడదపై కూడా ఆలోచించాలి.
రేబిస్ వ్యాధికి గురైన
కుక్క కరిచినవారు
వెంటనే చికిత్స తీసుకోకుంటే
ప్రాణాలకే ప్రమాదం
బ్రతికిన కొంతకాలమూ
కుక్కలాగా ప్రవర్తిస్తూ
దగ్గరివారితోనూ
భయం భయంగా ఉంటారు.
యజమాని చనిపోతే
రోజుల తరబడి
ఆహారం ముట్టని కుక్కలు తెలుసు
మనాదితో మట్టిలో కలిసిన
కుక్కలగూర్చి విన్నాం
ఇప్పుడు కుక్కల భయంతో
వంటరిగా రాత్రులు
బయటికెళ్ళాలంటే భయం
బహుశా మనిషి ప్రవర్తన ప్రభావమే
కుక్కల ప్రవర్తనపై ప్రతిఫలిస్తుందేమో.

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

పట్టుకున్నట్టే పట్టుకుని
విడిచిపెట్టే యంత్రాంగం
నాలుగువేదాలు వల్లించిన
శునకాలు ఆనాడు
నాలుగు నాళ్ళు బతకనీయక
జోరు చూపిస్తున్న కుక్కలు నేడు
అంతేలేదా ఈ జోరుకు
మనుషులంతా బేజారు!!.
అరిచే కుక్క కరువదు
కరిచే కుక్క మొరగదు
అయినా సమానత్వాన్ని చూపుతూ
రాజైనా పేదైనా
కలెక్టర్ అయినా కార్మికుడైనా
సమానంగా చూస్తూ
కరిచే కుక్క
బొక్క కోసం ఆశ
తోక ఊపుకుంటూ నీ వెంటే
పోలీసులకు ఆసరా

-జె.వి.కుమార్ చేపూరి

రాత్రిళ్ళు కుక్కల చప్పుడు

గల్లీ గల్లీల్లో రాత్రుళ్లు
కుక్కలు బెడద ఎక్కువ
ప్రతి వారి నోట
బాబోయ్ కుక్క
అంటూ అరుపులు.
రాత్రిపూట జన సంచారం తక్కువై
ఏ గల్లీకి పోయినా
అర్ధరాత్రి పూట
కుక్కల మోత ఎక్కువ
పెద్దలూ చిన్నలూ.
అందరూ కలిసి హడి హడి జపం
అయినా భౌభౌలు తగ్గవు.
ఇంటి కుక్క
బయటి కుక్క
రెండూ భౌభౌలే
నిద్రలో ఉన్న వృద్ధులకు
చప్పుడుకే నిద్ర అంతరాయం
విధిరాతకు వారసులం
ముడిపడిన
జీవితానికి గమనదారులం.

- వి.సంధ్యారాణి

కుక్కల నియంత్రణ

కుక్క అంటే
ఒక విశ్వాసం
ఒక నమ్మకం
ఇంటి కాపలా సింహం
మన పెంపుడు నేస్తం.
పెంపుడు కుక్కతో లేదే భయం
మన ఇంట్లో భాగం
వీధి కుక్కలతోనే కష్టం
వాటి దీన గాఢ తడుపు నయనం
లక్షల్లో పెరిగే వాటి సంఖ్య
అమాంతం
పగలు రేయి
వీధులే వాటి నివాసం
ఎండా వానలకు చూరు ఆకాశం
దొరకదు కడుపు నిండా గ్రాసం
గుక్కెడు నీళ్లు కూడ కరువైన వైనం.
గోటి చుట్టుపై రోకటి పోటు చందం
పోకిరి పిల్లలు చేసే రాళ్ళ గాయం
తప్పిస్తుంది వాటి మతి స్థిమితం
తెప్పిస్తుంది అసహనం
వీధిలో ఆడే పిల్లలపై ప్రతాపం.
కుక్క కాటుకు
లేనే లేదు ఔషధం
టీకా ఒక్కటే శరణ్యం
సర్కారు ఆసుపత్రుల్లో
టీకా శూన్యం
కార్పొరేట్ ఆసుపత్రుల్లో
తడిసి మోపెడు భారం
పేదవాళ్ళకేమిటి మిగిలిన మార్గం
పేదోళ్ళకు
కుక్క కాటొక తీరని శోకం
వీధిలో కుక్కల బెడదొక శాపం.
అభివృద్ధి చెందిన దేశాల్లో
కానరాదొక వీధి శునకం
పేద దేశాల్లో
జనాభాతో బాటే
పెరుగుదల కుక్క సంతానం
ప్రాంతీయ నమ్మకాల సంప్రదాయం
పెంచుతుంది వాటి
సంఖ్యను బహు శాతం.
ప్రభుత్వాలు పాటిస్తే
కుక్కల నియంత్రణం
నిరోధిస్తే వాటి
సంతాన సాఫల్య సామర్థ్యం
కల్పిస్తే కుక్క కాటు టీకా
అందుబాటు సౌకర్యం
ప్రజలు సహకరిస్తే
ప్రభుత్వాలకు కొంచెం
పిల్లలపై ఉంచితే
పర్యవేక్షణం నిత్యం
కుక్కల బెడద
తగ్గుతుంది అధిక శాతం.

-సి.హేమలత
9666779103

అక్షరాలను అద్దుకో

పచ్చిక బయళ్ళమీద
గడ్డి పరకల పలకపై
రాసిన మంచు ముత్యాల
అక్షరాలను
అద్దుకుంటుంది ఉదయం,
మనసుతో ఊరిన నిశ్శబ్ద ,
శబ్దాలను,
మెదడు కాగతంలో ముద్రించడానికి
అక్షరాలను
దాచుకుంటుంది హృదయం.
రాత్రి రెప్పలలో దాగిన
తెల్లని కనుపాప
వెన్నెల కాగితంపై
అక్షరాలు దిద్దుతుంది తమసం.
వేకువ కిరణాల పాళితో
గుమ్మానికి సొబగాయెను
తెలుగింటి ఆడపడుచు
సొగసంతా ఉగాదిదే.
సరిగమలను పలుకుతున్న
కోకిలమ్మ హాయిచూడు
ఊగుతున్న పూలరెమ్మ
కులుకంతా ఉగాదిదే.
తరతరాల సాంప్రదాయ
వైభవమ్ము చూడరమ్మ
సింగారపు పల్లెసీమ
తళుకంతా ఉగాదిదే.
పంచాంగపు శ్రవణము
చిన్న పెద్ద కేరింతలు
రాశిగమన జాతకాల
నడకంతా ఉగాదిదే.
షడ్రుచులతా తెలుగు వారి
తొలి పండుగ శొబగుచూడ
బంధాలను పదిలపరచు
ఘనతంతా ఉగాదిదే.

ఉగాది

కోనలలో కూజితాల
రాగమంతా ఉగాదిదే
చైత్రమాస మావిపిందె
వగరంతా ఉగాదిదే.
వసంతాన వేపపూత
పరిమళాలు పరుచుకుంది
చిగురాకుల రంగులతో
సొబగంతాఉగాదిదే.
మామిడాకు తోరణాలు

నేటి నిశ్శబ్ద రాతలను
ఆశల పుస్తకంపై ముద్రిస్తుంది
ఆకసం
అక్షరం ,ఆర్ద్రతల,ఉద్విగ్నతల
కాగితంపై,
ఉలితో అక్షరాలను శిలాక్షరంలా
చెక్కుతుంది భావశిల్పం
సమాజం వీధిలో
విలువలను పెంచుతూ
భిక్షా పాత్ర కాగితం పై
అందుకుటుంది అక్షరం.
అక్షరం, జ్ఞాన కల్హారం
అక్షరం మనో విహారం.

డా॥సముద్రాల శ్రీదేవి,
9949837743

రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

వరంగల్, ఏప్రిల్ 19:రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని పరకాల శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డి అన్నారు. గత ఏడాది వడగళ్లవానకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహార చెక్కులను హనుమకొండలోని వారి నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు పక్షపాతిగా నిలిచిన ఘనత సీఎం కేసీఆర్ కు దక్కుతుందని స్పష్టం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన అకాల వర్షం అపార నష్టాన్ని కలిగించిందని ఆయన గుర్తు చేశారు. ఆపదలో ఉన్న రైతులను ప్రతిపక్ష నాయకులూ పరామర్శలకే అంకితమయ్యారని మండిపడ్డారు. సహాయం చేయకపోగా ఆపన్నహస్తం అందించే బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులను సమయం వచ్చినప్పుడు రైతులు బుద్ధి చెప్తారన్నారు. ఇటీవల వడగళ్లవానతో నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. అధికారులు పంట నష్టాల అంచనా వేస్తున్నారని ఆయన తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతు బంధు, రైతు భీమా పథకాలను అమలు చేసి తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసి, రైతులకు సమృద్ధిగా సాగునీటిని, 24 గంటల కరెంటును అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆకే దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతూ రాష్ట్రంలో ధాన్యం కొలుగోలు చేయడం లేదన్నారు. కేంద్రం సహకరించకున్నా తెలంగాణ ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తోందని చెప్పారు. దేశంలోని రైతులందరూ కేసీఆర్ నాయకత్వం కావాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వాలు ఏనాడురైతులను పట్టించుకోలేదని విమర్శించారు. అకాల వర్షాల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ గారన్నారు. ఈ రోజు పరకాల మండలం మల్లక్కపేట రైతులకు చెక్కులు అందచేసే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని.రెండు రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గ్రామాల వారీగా పంట నష్టపోయిన రైతులకు చెక్కులు అందచేస్తామని తెలిపారు.అందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు సమన్వయంతో కలిసి రైతులకు ఆయా గ్రామాలలో చెక్కులు అందచేయాలని సూచించారు.

నందిగామ ఏసీపీ ఆఫీస్, పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీసీపీ..

అమరావతి, ఏప్రిల్ 19:ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఏసీపీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ను విజయవాడ రూరల్ డీసీపీ అజిత వెనిగండ్ల సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీబీ నాగేశ్వర రెడ్డికి సీఐ సతీష్ కు డీసీపీ అజిత పలు సూచనలు చేశారు. అనంతరం నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిధిలో క్రైమ్ రేట్ తగ్గేలా చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారిపై యాక్సిడెంట్లు జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని డీసీపీ సూచించారు.

ఈ నెల 2న రాజమహేంద్రపురం ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం, తూ.గో.జిల్లా సభలో ప్రముఖ కవి ఎస్.ఆర్.పృథ్వీగారి 'గోదావరి నానీలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శివప్రసాద్

గోరాశాస్త్రి వంటి కలం, గళం అవసరం

-మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ కృష్ణారావుకు గోరాశాస్త్రి ఉత్తమ జర్నలిస్టు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. చిత్రంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, అల్లం నారాయణ.

రాజకీయం, జర్నలిజంలో ప్రమాణాలు తగ్గుతుండటం ఆందోళన కలిగించే విషయమని, అయితే ఇప్పటికీ కొన్ని పత్రికలు విలువలను పాటిస్తున్నాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. గోరాశాస్త్రిలాంటి కలం, గళం నేడు అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ టి.కృష్ణారావును నవసాహితీ ఇంటర్నేషనల్ (చెన్నై) సంస్థ 'గోరాశాస్త్రి ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారం'తో సత్కరించింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "నిజాన్ని కుండబద్దలు కొట్టినట్లు ఉండే గోరాశాస్త్రి వ్యాసాలు బాగా చదివే వాడిని, పత్రికల్లో నేడు విషయం లేకుండా విమర్శ ఉంటోంది. క్లిష్టయాన్ని జనానికి అర్థమయ్యే భాషలో సులువుగా సరళంగా చెప్పాలని గోరాశాస్త్రి అనేవారు. నాలోని దూకుడు స్వభావాన్ని గోరాశాస్త్రితో ఉన్న అనుబంధం తగ్గించింది. సోషల్ మీడియా వింత పోకడలను ఎంత త్వరగా దూరం చేసుకుంటే అంత మంచిది. అక్షరాన్ని అమ్మలా భావించి రాసినప్పుడే భాషను కాపాడుకోగలం. ఇంట్లో, బడిలో గుడిలో అమ్మ భాషను ఉపయోగించాలి. నేటితరం కలం చేతపట్టగానే, తనకంటే ఉన్నతమైన వారున్నారని గుర్తు చేసుకోవాలి' అని వెంకయ్యనాయుడు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, ఎపీ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.వేణుగోపాలనాయుడు, రవికాంత్‌రెడ్డి, నవ సాహితీ వ్యవస్థాపకులు సూర్యప్రకాష్ కొప్పరపు కవుల కళాపీఠం అధ్యక్షుడు మా శర్మ, గోరాశాస్త్రి, కుమార్తె సునందశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రేలంగికి ఆత్మీయ సత్కారం

ప్రముఖ సినీ దర్శకుడు రేలంగినరసింహారావుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. శారద మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన అదిగదిగో యమునా తీరం తెలుగు హిందీ సినీ సంగీత విభావరి సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయనను వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు సన్మానించారు. నిర్వాహకురాలు, గాయని శారద, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు శ్రీరామ సంస్థ నిర్వాహకులు గొర్తి చంద్రశేఖర్, గాయని రేణుకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
కవన కిరణాలు
తెలుగు సాహితీ సమాఖ్య
సెల్: 90044 28159
ఆధ్వర్యంలో
కవన కిరణాలు మూడవ కవితా సంకలనం,
పి.పద్మావతి గారి 'అమృత ధారలు', 'బివిటీలు', 'జనేకా నామ్ జందగీ' (హిందీ)
మరియు
ఎం.వి.ఉమాదేవి గారి 'వనజ శతకం'
పుస్తకాల ఆవిష్కరణ
తేది : 29-04-2023 శనివారం, ఉ॥ 9.00 గం॥ల నుండి మ॥ 1.00 గం॥ల వరకు
వేదిక : రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్.
ముఖ్య అతిథి, ఆవిష్కర్త & పురస్కార ప్రదాత
డా॥ కె.వి.రమణా చారి గారు
ఐ.ఎ.ఎస్. (ఐ) తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు
శ్రీ శివ మంచాల గారు, వ్యవస్థాపక అధ్యక్షులు
గౌరవ అతిథి
శ్రీ బైస దేవదాసు గారు
నేటినిజం పత్రిక సంపాదకులు
విశిష్ట అతిథి
శ్రీ దేవానంద్ నాగెల్ల గారు
బహుజన సాహిత్య అకాడమి మహారాష్ట్ర శాఖ అధ్యక్షులు, ముంబాయి
ఆత్మీయ అతిథులు
శ్రీ బి.సిహెచ్.వి.సుబ్బారావు గారు, (అశ్విని)
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు, సినీ, టి.వి. గీత రచయిత
శ్రీ సాహిత్య ప్రకాశ్ గారు, సినీ, టి.వి. నటులు, న్యూస్ రీడర్
డా॥ దీపక్ న్యాతి గారు, సినీ దర్శకులు, నంది అవార్డు గ్రహీత
శ్రీమతి పి.పద్మావతి గారు, 'అమృత ధారలు', 'బివిటీలు' రచయిత్రి
సాహిత్య, సామాజిక, విశిష్ట సేవారత్న, జాతీయ పురస్కారం - 2023
పురస్కార గ్రహీత : శ్రీ బైస దేవదాసు గారు
(నేటినిజం పత్రిక సంపాదకులు)
అందరూ ఆహ్వానితులే

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాధ్వా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
(ప్రథమ)

పోటీ ఫలితాలు

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ వలిపే

బంధాల అనుబంధం

నేగు బంధంతో మొదలై
కడవరకు సాగే బంధాల తీగ
తల్లివేరుతో తనువుపెంచుతు
శాఖోపశాఖలుగా విస్తరిస్తు
అందమైన రంగుల పూలెన్నో
వికసించి పరిమళాలు పంచును.
అంటు మొక్కలెన్నో
దూర దూరాన పెరుగుతు
బంధాలతీగతో అనుబంధాలను
ఆస్తీ అంతస్తులకై బేరాలాడుతు
ఆత్మీయతలకు ఉరివేస్తు
శవాలతో చట్టం
చుట్టు తిరుగుతున్నారు.
రక్త బంధాలు నేడు
సంపద కోటలో చిన్నబోయి
ఒంటరి నడక నడుస్తు
ఐశ్వర్య కవచాన్ని ధరించి
తాత్కాలిక బంధాలతో
లైతక్కలాడుతు
తమది ఆధునికమంటు
అంధకారాన్ని పెంచుతున్నారు.
ఆయుష్షు పోసి
అడుగులు నేర్పిన అమ్మానాన్న
ఆదరించి ఎత్తుకొన్న అక్కా అన్నా
ప్రేమను పంచిన చెల్లి తమ్ముడు
మూలాలైన తాతా అమ్మమ్మలు
అంతా భారమైన ముసలివారై
బరువు మోయలేని తరాలు
నేడు కొట్లాటలతో
కోర్టు మెట్లెక్కుతున్నారు.
చేతులు కాలాక ఆకులు పట్టినట్లు
అంతా అయ్యాక అయ్యోఅంటే
తిరిగిరాని ప్రాణం తిరగలేని బంధం
కంటిని కడలిచేసి అలల తాకిడికి
మనసు సుడిగుండంలో పడి
తీరం దొరకని తరంగమైపోతుంది
చిత్రపటమై చింతలు పెంచుతుంది.

-డా.బి.సుధాకర్
సిద్దిపేట

(ద్వితీయ)

అనుబంధాలు

పచ్చని పల్లె ప్రాంతం
కల్లాకపటం తెలియని మనుషులు
ఊరంతా వరుసల తో
ఆత్మీయ పిలుపులు
కుల మతాల కు అతీతం
ఉమ్మడి కుటుంబా లకు నెలవు
ఒకే కంచంలో
గోరు ముద్దలు తిన్న
అన్నదమ్ములు
పెరిగి పెద్ద అయి
ఆస్తుల కై కొట్టుకు చస్తున్నారు
నేడు
డబ్బుల సంపాదన లో
పడి కుటుంబ విలువలు
మరుస్తున్నరు
స్వార్థం పెరిగి
ఒంటరి అవుతున్నారు నేడు...
చావులో కూడా
బంధాలను బతికించి
అందరి కండ్లు తెరిపించిన
సినిమా బలగం...
మరిచిన అనుబంధలను
గుర్తు చేసి కలిపింది బలగం
ఎవరింట్లో వాళ్లే
మాట్లాడు కోవడానికి
సమయం లేని యాళ్ల
మనసులో లోని
మనుషుల లోని అనుబంధంలను
కలుపునేల చేసింది...
ఊరు ఊరంతా ఒకే దగ్గర
కలిసి చూసేలా చేసింది బలగం...
కుటుంబాల చరిత్ర ను
తిరిగి చూసేలా
చేసింది బలగం...
భవిష్యత్తు తరాలకు
ఆదర్శం...మార్పు మనతో
సాధ్యం అని చవిచూసిన
చిత్రం బలగం...

-వంగ గీతా రెడ్డి
కరీంనగర్

వైద్యవృత